ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
ఆదివారం, 7 జూలై 2024
5



	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	23	39
భద్రాద్రి	26	32



అన్ని విధాలా మేలు 'ఆయిల్‌పామ్'

- ఈ ఏడాది 11,500 ఎకరాల్లో కొత్తగా సాగు
- ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తోంది
- కల్లూరిగూడెం వద్ద ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో పామాయిల్ పరిశ్రమ
- ఏడాది కనీసం లక్ష రూపాయల ఆదాయం గ్యారెంటీ
- రైతులు వరి నుంచి ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లాలి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జిల్లా హార్టికల్చర్, సెరీకల్చరల్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బీవీ రమణ

ఖమ్మం జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం హార్టికల్చర్, సెరీకల్చర్ అభివృద్ధికి ఉద్యానవన, మల్బరీ శాఖ తరపున ప్రణాళిక రూపొందించామని, రైతులను అన్ని విధాలా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా హార్టికల్చర్, సెరీకల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ బీవీ రమణ పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో జిల్లాలో ఉద్యానవన మల్బరీ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

ప్రశ్న: ఈ సీజన్‌లో హార్టికల్చర్, సెరీకల్చర్ ద్వారా చేపట్టబోతున్న కార్యక్రమాలుఏమిటో చెప్పండి?

జవాబు: జిల్లాలో ఈఏడాది 11500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు ప్రణాళిక రూపొందించాం. ఇప్పటికే మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టి తోటలు వేయిస్తున్నాం. గతంలో జిల్లాలో 15వేల ఎకరాల వరకు సాగవుతున్నది. కొత్తగా ఈఏడాది 11500 మొక్కలు వేయిస్తున్నాం.

ప్ర: ఆయిల్‌పామ్ సాగుకు శాఖపరంగా మీరిచ్చే ప్రోత్సాహం ఏమిటి?

జ: రైతులకు సబ్సిడీపై మొక్కలు ఇస్తున్నాం. ఆయిల్ పామ్ వేసేప్రతి రైతుసీజన్ ముందుగానే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రైతు పేరు, భూమి వివరాలు, ఎన్ని ఎకరాల్లో ఆయిల్‌పామ్ వేస్తున్న విషయం హార్టికల్చర్ అధికారి లేదా ఏఈవో ద్వారా రిజిస్ట్రేషన్ చేయిస్తే ఎకరానికి 57 మొక్కలు ఇవ్వడం జరుగుతుంది. రైతు కేవలం మొక్కకు రూ.20మాత్రమే చెల్లించాలి. మొక్క ఖరీదు రూ.193 కాగా, రూ.173 ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తుంది.

ప్ర: ఆయిల్‌పామ్ రైతుకు ఏవిధంగా లాభసాటి వ్యవసాయంగా ఉంటుంది?

జ: ఆయిల్‌పామ్ వేసుకునే రైతుకు మొక్కలు ఇవ్వడంతో పాటు నాలుగేళ్లపాటు ఎకరానికి రూ.4200 చొప్పున ప్రోత్సాహకం అందిస్తాం. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా బీసీ చిన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీ,పెద్ద రైతులకు 80శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం అందిస్తాం. ఐదేళ్ల నుంచి రైతుకు దిగుబడి వస్తుంది.అప్పటి వరకు మిశ్రమ పంటలు వేసుకోవచ్చు. ఎకరానికి సగటున పది నుంచి 15టన్నుల వరకు దిగుబడి వస్తుంది. అన్ని ఖర్చులు పోను రైతుకు ప్రతి ఏటా లక్షరూపాయల వరకు ఆదాయం ఉంటుంది. అలాగే మొక్క పెద్దదైన తర్వాత కూడా ఆయిల్‌పామ్‌లో కోకో,అల్లం, వక్క తదితర పంటలు సాగుచేసి అదనపు ఆదాయంపొందే అవకాశం ఉంటుంది. వీటితో పాటు కోళ్ల పెంపకం, మేకలు, పొట్టేళ్ల పెంపకాలు చేసి రైతులు అదనంగా ఆదాయం పొందవచ్చు.

ప్ర: ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచుతున్నారు... కానీ మార్కెట్ సదుపాయం ఉందా?

జ: ఆయిల్‌పామ్‌కు దేశ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. ఇతర దేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నాయి. ప్రస్తుతం టన్ను ధర రూ.13,720 ఉంది. ఇది డిమాండ్‌నుబట్టి పెరుగుతూ ఉంటుంది. రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆయిల్‌పామ్‌సాగులో మొదటి స్థానంలో ఉంటే ఖమ్మంజిల్లా రెండోస్థానంలో ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అప్పారావుపేట, అశ్వారావుపేటలో ఆయిల్‌ఫామ్ పరిశ్రమలున్నాయి. ఖమ్మం జిల్లా పరిధిలో కొత్తగా కల్లూరిగూడెంలో తెలంగాణ ఆయిల్‌ఫెడ్ గవర్నమెంట్ కార్పొరేషన్‌కు 42 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. 30నుంచి 90 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రూ.130కోట్లతో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు కాబోతుంది. త్వరలో దీనికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే గోద్రేజ్ కంపనీ కూడా కొణిజర్ల మండలంలోని గుబ్బగుర్తి సమీపంలో 120 ఎకరాలు భూమిని కొనుగోలు చేసింది. ఈ కంపెనీ కూడా ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీతో పాటు సీడ్ గార్డెన్‌ను దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేయబోతుంది. ఇప్పటి వరకు విదేశాలనుంచి మొలకెత్తిన సీడ్స్ తెచ్చుకుని నర్సరీలో ఏడాదిపాటు పెంచి మొక్కలు ఇస్తున్నాం. గోద్రేజ్ కంపెనీ సీడ్ గార్డెన్ ద్వారా ఇక్కడే మొక్కల ఉత్పత్తి కూడా జరపనుంది.

ప్ర: ఆయిల్‌పామ్‌తో ఇతర లాభాలు ఏమైనా ఉన్నాయా?

జ: గెలల నుంచి క్రూడాయిల్ తీయడంతో పాటు వచ్చిన వ్యర్థాలతో సేంద్రీయ ఎరువులు, ఇతర ఉత్పత్తులు తయారు చేయవచ్చు. ఆయిల్‌పామ్ గెలలకు దొంగల బెడద, కోతుల బెడద ఉండదు. (మిగతా 6వ పేజీలో)

Sunday SPECIAL



నవ్వుల రేడు గుణకర్

- స్టాండప్ కమేడియన్‌గా, ఫన్నీ యాంకర్‌గా రాణిస్తున్న కళాకారుడు
- సమయానుకూల హాస్యం పండించడంలో దిట్ట
- యూట్యూబ్ చానెల్ ద్వారా పాపులర్
- సినిమాలు, టీవీ సీరియల్స్, షార్ట్‌ఫిల్మ్‌లలో నటుడిగానూ రాణింపు
- బహుముఖ ప్రజ్ఞతో కళారంగంపై తనదైన ముద్ర

6



ఖమ్మంలో వనజీవి రామయ్యతో కలసి మొక్కను నాటుతున్న ప్రియాంకవర్గీస్

వనమహోత్సవంలో టాప్‌లో నిలవాలి

- మొక్కలు నాటే లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తిచేయాలి
- అటవీ సంరక్షణ ముఖ్య అధికారి ప్రియాంకవర్గీస్

వివరాలు : 6లో



రుద్రంపూర్‌లో మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్

మొక్కలతోనే ఆరోగ్యం

- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- రుద్రంపూర్ వన మహోత్సవంలో కలెక్టర్ జితేష్ వి. పాటిల్

వివరాలు : 7లో



ఖమ్మంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన విద్యార్థులు

'ఎప్‌సెట్' సర్టిఫికెట్ల పరిశీలన షురూ

- తొలి రోజు 800 మంది విద్యార్థుల హాజరు
- ఆదాయ ధ్రువపత్రం ఉన్న వారికి ఫీజు మాఫీ, రాయితీ

వివరాలు : 6లో

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

- అత్యధిక మెజారిటీ ఇచ్చిన ప్రజలకు పాదాభివందనం
- ఖమ్మంలో యూనివర్సిటీ, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు తీసుకువస్తా
- ప్రతీ కార్యకర్తకు అందుబాటులో ఉంటా
- ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి



ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 6: ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల చరిత్రలోనే అత్యధిక మెజారిటీ ఇచ్చినందుకు పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ కార్యకర్తలకు పాదాభివందనమని, ఎంతో చైతన్యవంతమైన ఉమ్మడి జిల్లా అభివృద్ధే లక్ష్యంగా తాను ముందుకు వెళ్తానని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. ఎంపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సారిగా జిల్లాకు వచ్చిన ఆయన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు ఘనంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రఘురాంరెడ్డి మాట్లాడుతూ తాను జిల్లాకు వస్తున్న సందర్భంలో రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ఫోన్ చేశారని తెలిపారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల ఫైల్స్ కలెక్టరేట్‌లో ఉన్నాయని వాటి పరిష్కారం కోసం ఉమ్మడిగా కలిసి పని చేస్తామని తెలిపారు. అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పార్లమెంట్ పరిదిలోని ఎమ్మెల్యేలతో కలిసి సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వ యూనివర్సిటీ తీసుకొస్తానని, కిన్నెరసాని సమస్యలు, బొగ్గు గనుల వేలాన్ని సింగరేణి సంస్థకు అప్పగించేందుకు పోరాటం చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న కొత్తగూడెం ఎయిర్‌పోర్టును తిరిగి ప్రారంభించేందుకు కార్యచరణ చేస్తానని హామి ఇచ్చారు. మూతపడిన స్పాంజ్ ఐరన్ కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. కేంద్రం నుంచి జిల్లాకు రావాల్సిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకోచ్చేందుకు పనిచేస్తానన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఉమ్మడి జిల్లా ప్రజల సమస్యలు, అభివృద్ధి కోసం ఎంపీ గళమెత్తాలని కోరారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వీవీ పాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, యడ్లపల్లి సంతోష్, కార్పొరేటర్లు లకావత్ సైదులునాయక్, మలీదు వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్లు వడ్డెబోయిన నర్సింహారావు, యర్రం బాలగంగాధర్‌తిలక్ తదితరులు పాల్గొని ఎంపీ రఘురాంరెడ్డిని సన్మానించారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి

పాఠశాలలో ఆవరణలోనే ఘటన



చుంచుపల్లి, జూలై 6: ఏడో తరగతి చదువుతున్న బాలుడు పాఠశాలలో గుండెపోటుతో మృతి చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చుంచుపల్లి మండలంలో శనివారం చోటు చేసుకుంది. సుజాతనగర్ మండలంలోని సర్వారం గ్రామ పంచాయతీలో తేజావత్ నరసింహ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ భార్య, ముగ్గురు చిన్న పిల్లలతో జీవిస్తున్నారు. రెండో సంతానం అయిన కుమారుడు హరికృష్ణ(12) చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ కాలనీలోని ఓ ప్రవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. రోజు లాగానే ఆటోలో పాఠశాల వద్ద దింపేసి వెళ్ళిపోయాడు. ఈ క్రమంలో దాహం వేస్తుందని మంచినీరు సేవించిన హరికృష్ణ చాతిలో నొప్పి వస్తుందని అంటూ కింద పడిపోయాడు. దీంతో పాఠశాల యాజమాన్యం స్థానిక రామవరం మాతా, శిశు ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్ళారు. బాలుడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నతనం నుంచి హరికృష్ణ గుండె జబ్బుతో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు.

మూడు ముక్కలైన భద్రాచలం

- భద్రాచలం, సీతారాంనగర్, శాంతినగర్ గ్రామ పంచాయతీలుగా విభజన

భద్రాచలం, జూలై 6: ఏపీలో కలిసిన ఐదు పంచాయతీలను భద్రాద్రిలో విలీనం చేయాలని భద్రాద్రి వాసులు డిమాండ్ చేస్తున్న తరుణంలో... ఊహించని శరాఘాతం ఎదురైంది. భద్రాచలం గ్రామ పంచాయతీని ప్రభుత్వం మూడు ముక్కలు చేసింది. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలుపడం చర్చనీయాంశమైంది. 2022 డిసెంబరు 16న అప్పటి ప్రభుత్వం భద్రాచలంను మూడు గ్రామ పంచాయతీలుగా, సారపాకను రెండు గ్రామ పంచాయతీలుగా విభజిస్తూ జీవో నెం.45ను జారీ చేసింది. భద్రాచలం పంచాయతీని భద్రాచలం, సీతారాంనగర్, శాంతినగర్ గ్రామ పంచాయతీలుగా విభజించి శాసనసభలో బిల్లు పెట్టింది. 2023 ఫిబ్రవరి 11న ఆ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందింది. దీనిపై భద్రాద్రి వాసులు తీవ్ర నిరసన ప్రకటించారు. రామక్షేత్రాన్ని విభజించడం వల్ల ప్రాముఖ్యతను కోల్పోతుందని ఇది ఒక రకంగా భద్రాద్రి ప్రాశస్త్యాన్ని ధ్వంసం చేయటమేనని నాటి ఎమ్మెల్యే పోదెం వీరయ్య అసెంబ్లీలో స్పష్టం చేశారు. 'మూడు వద్దు... భద్రాద్రి ఒక్కటే ముద్దు..' అని ఆనాడు గవర్నర్‌కు వినతిపత్రం సైతం అందజేశారు. ఈ క్రమంలో పంచాయతీ విభజన బిల్లును అప్పటి గవర్నర్ వెనక్కిపంపడంతో మూడు ముక్కల గండం తొలగినట్టేనని అంతా భావించారు. ఈ క్రమంలో గతేడాది ఆగస్టులో భద్రాద్రి మూడు ముక్కల విభజన రాష్ట్ర కేబినెట్ తీర్మానం ద్వారా ఆమోదం తెలపడంతో మళ్లీ తెరపైకి వచ్చింది. మళ్లీ బిల్లును గవర్నర్ ఆమోదంకు అప్పటి ప్రభుత్వం పంపింది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావటంతో నాటి పాలక పక్షం, నాడు ప్రధాన పక్షంగా నేడు అధికార పక్షంగా ఉన్న కాంగ్రెస్ సహా ఇతర రాజకీయ పార్టీలు భద్రాచలంపై ప్రజల మనోగతం మేరకు నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశాయి.

అయితే శనివారం గవర్నర్ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలపడంతో భద్రాద్రి వాసులు ఒక్కసారిగా నివ్వెరపోయారు. నాడు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజామోదం మేరకే తుది నిర్ణయం ఉంటుందని పేర్కొన్న విషయాన్ని ప్రజలు గుర్తు చేస్తున్నారు. నేడు అధికార పక్షమైన కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని దాటవేస్తూ భద్రాచలంను మూడు ముక్కలు చేయటం సమంజసం కాదని స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని లేదంటే ప్రజాగ్రహాన్ని చూడాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు. భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకట్‌రావుతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఈ విషయంపై వెంటనే భద్రాద్రి వాసుల మనోగతాన్ని గుర్తించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. భద్రాచలం గ్రామ పంచాయతీ ఐదో షెడ్యూల్‌లో ఉండటంతో మునిసిపాలిటీగా మార్చేందుకు నిబంధనలు ఒప్పుకోవడం లేదు. దీంతో జనాభా రీత్యా భద్రాచలాన్ని మూడు పంచాయతీలుగా విభజించేందుకు అడుగులు వేశారు. కానీ ఆదాయ వనరుల పరంగా చూస్తే.. మూడు పంచాయతీల్లో సమతుల అభివృద్ధి ఉండే అవకాశం లేదని వివిధ వర్గాలు చెబుతున్నాయి. అందువల్ల భద్రాచలాన్ని ఒక్క పంచాయతీగానే కొసాగాలనే డిమాండ్ ఏర్పడింది. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సమస్య ఎటువైపు తిరుగుతుందనేది ఆసక్తిగా మారింది.

వైద్యులు ఎక్కడ ?

- ఇదేనా పనితీరు, కొయ్యూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై పీవో ఆగ్రహం
- అందుబాటులో లేని ఇద్దరు వైద్యులు
- చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు పీవో ఆదేశాలు
- గ్రామాల్లో ఆరోగ్య పరిస్థితిఉలపై ఆరా
- కొయ్యూరు కార్యదర్శికి షోకాజ్ నోటీస్

6

ఆ ఐదూళ్లూ వచ్చేనా..?

- ఇద్దరు సీఎంల సమావేశంలో చర్చ
- హోంశాఖకు లేఖ రాయాలని నిర్ణయం

ఖమ్మం, జూలై 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):: భద్రాచలాన్ని ఆనుకొని ఏపీలోఉన్న ఐదు పంచాంయతీలను తెలంగాణలో కలపాలన్న దానిపై ఇద్దరు సీఎంల సమావేశంలో చర్చకు వచ్చింది. శనివారం హైదరాబాద్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్య ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐదు పంచాయతీల విలీనంపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు చర్చించారు. భద్రాచలాన్ని ఆనుకొని ఉన్న ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం ఈ ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరావు లేఖలో సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రధాన చర్చ జరిగింది. అయితే దీనిపై కేంద్ర హోంశాఖకు లేక రాయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. అలాగే సరిహద్దులో గంజాయి రవాణ నివారణ అంశంపై చేర్చినట్లు, రెండు రాష్ట్రలు ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించుకున్నారు.



తగ్గిన ఎరువుల భారం

- రెండు రకాలపై ధరల తగ్గింపు
- పొటాష్, అమ్మోనియాకు వర్తింపు
- అసలు ధరకు 5శాతం జీఎస్టీ అదనం

6

వైద్యులు ఎక్కడ?

- ఇదేనా పనితీరు, కొయ్యూరు వైద్యశిబ్బందిపై పీవో ఆగ్రహం
- అందుబాటులో లేని ఇద్దరు వైద్యులు
- చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు పీవో ఆదేశాలు
- కొయ్యూరు కార్యదర్శికి సోకాజ్ నోటీస్

చర్ల, జూలై 6: చర్ల మండలం కొయ్యూరు ప్రభుత్వ వైద్యశాల సిబ్బందిపై ఐటీడీఏ పీవో రాహుల్ శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యశాల్లో ఇద్దరు వైద్యులు అందుబాటులో లేకపోవడం, పీవోకు వైద్య సిబ్బంది పొంతన లేని సమాధానం చెప్పడంతో, శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను పీవో ఫోన్‌లో ఆదేశించారు. శనివారం ఉదయం చర్ల మండలంలో పీవో పర్యటించారు. ముందుగా సత్యనారాయణపురం గ్రామంలో తిరిగారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని వ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఈదయ్యను ఆదేశించారు. అనంతరం కొయ్యూరు వైద్యశాలకు చేరుకున్న ఆయన రోగులతో మాట్లాడారు. వైద్యం అందిస్తున్న తీరు అడిగితెల్సుకున్నారు. ఇదే క్రమంలో డెంగ్యూ రోగులను గుర్తించారు. ఎక్కడి నుంచి వచ్చారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఇదే క్రమంలో అక్కడ విధులు నిర్వహించాల్సిన ఇద్దరు వైద్యులు లేక పోవడంతో పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది కూడా పొంతన లేని సమాదానం చెప్పడంతో ఇదేనా మీ పని తీరు అంటూ డీఎంహెచ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మీ సిబ్బంది తీరు సరిగ్గా లేదని, ఇద్దరు వైద్యులు, ఇతర సిబ్బంది డ్యూటీలో లేరని, రోగులు ఇబ్బంది పడుతున్నారని శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని పీవో ఆదేశించారు. జ్వరాలు ప్రబలే గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చెయ్యాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని అక్కడ ఉన్న వైద్య సిబ్బందిని ఆదేశించారు. అలాగే కొయ్యూరు పంచాయతీలో పారిశుద్యం సరిగ్గా లేక పోవడంతో కొయ్యూరు పంచాయతీ సెక్రటరీ ఉదయ కుమార్‌కు సోకాజ్ నోటీసులు జారి చేశారు. అనంతరం కత్తిగూడెం ప్రభుత్వ పాఠశాలను తనికీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులచే బోర్డుపై అక్షరాలు రాయించారు. పిల్లకు పెన్నులు, నోట్‌పుస్తకాలు అందజేశారు. పిల్లకు అర్థంఅయ్యేలా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయుడికి సూచించారు. పీవో వెంట చర్ల ఎంపీవో అలీ, సీడీపీవో చైతన్య ఇతరులు ఉన్నారు.


కొయ్యూరు వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పీవో రాహుల్

ప్రైవేటీకరణను అడ్డుకుంటేనే సింగరేణికి మనుగడ

- దేశ సంపదను కార్పోరేట్లకు దోపిడి పెడితే చూస్తూ ఊరుకోం
- సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా
- బొగ్గుగనుల వేలాన్ని నిరసిస్తూ హెడ్డాఫీస్ ఎదుట రిలే దీక్షలు ప్రారంభం

కొత్తగూడెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణను అడ్డుకుంటేనే సింగరేణి సంస్థ మనుగడ ఉంటుందని, కోల్ బెల్టు ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. తెలంగాణలోని శ్రావణపల్లి బొగ్గుబ్లాక్‌తోపాటు ఇతర బొగ్గుబ్లాక్‌లను వేలం వేసేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధర్యంలో వారం రోజులపాటు చేపట్టనున్న రిలే నిరాహారదీక్షల తొలిరోజు శిబిరాన్ని శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం దేశ సంపదను కుబేరులకు కట్టపెట్టి మరింత కుబేరులను చేసే చర్యలకు పాల్పడుతుందని ఇది పరోక్షంగా ఆర్థికంగా నేరానికి పాల్పడటమేనన్నారు. ప్రజలకు చెందాల్సిన బొగ్గు నిక్షేపాలు బడాబాబులకు కట్టపెడతామంటే చూస్తూ ఊరుకోబోమని, ప్రజా ఉద్యమాలతో మోదీకి కంటిమీద కునుకు లేకుండ చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు చెందాల్సిన బొగ్గునిక్షేపాలు బడాబాబులకు కట్టపెడతామంటే చూస్తూ ఊరుకోబోమని, ప్రజా ఉద్యమాలతో మోదీకి కంటిమీద కునుకు లేకుండ చేస్తామని హెచ్చరించారు. బొగ్గు వెలికితీతలో సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి సంస్థను కాదని లాభాల కోసం పని చేసే ప్రభుత్వేతర ప్రైవేట్ సంస్థలకు బొగ్గుబ్లాక్‌లను అప్పగించడం పరోక్షంగా సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే చర్యల్లో భాగమేనన్నారు.సింగరేణి సంస్థను పరిరక్షించుకునే బాధ్యత తెలంగాణ సమాజంపై ఉందని అందుకోసం విపక్ష పార్టీలు, కార్మికసంఘాలు చేపట్టబోయే ఆందోళన, పోరాటాల్లో కలిసి రావాలని పిలుపునిచ్చారు. బొగ్గుగనుల వేలంపాటను నిరసిస్తూ చేపట్టిన వారం రోజుల నిరసన దీక్షలు విజయవంతం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, జి. వీరస్వామి, వి. మల్లికార్జున్‌రావు, ఎన్‌వి. రమణమూర్తి, గట్టయ్య, రాము, కిష్టాపర్, సందెబోయిన శ్రీనివాస్, నాగేశ్వరరావు, చంద్రయ్య, మల్లయ్య, నాగయ్య, భూక్య దస్రు, హనుమంతరావు, రాములు, గోపీ కృష్ణ, లక్ష్మీనారాయణ, గోవిందు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట రిలే నిరాహారదీక్షలో ఏఐటీయూసీ నాయకులు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బీఎంఎస్ కృతజ్ఞతలు

కొత్తగూడెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రంలో నైనీ బ్లాక్ బొగ్గు గని ఉత్పత్తి ప్రారంభించినందుకు బొగ్గుశాఖమంత్రి జి. కిషన్ రెడ్డికి బీఎంఎస్ సెక్రటరీ పి. మాధవనాయక్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం బీఎంఎస్ భవన్‌లో సింగరేణి కోల్‌మైన్స్ కార్మికసంఘ్ ఏబీకేఎంఎస్, బీఎంఎస్, కొత్తగూడెం ఏరియా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఒడిశా రాష్ట్రంలో 2015లోనే నైనీ బొగ్గు బ్లాక్ 455 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిక్షేపాలు ఉన్న గనిని కేటాయించిందని కానీ గత రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం కారణంగా ఇప్పటి వరకు బొగ్గు ఉత్పత్తికి నోచుకోలేదని ఈ విషయాన్ని బీఎంఎస్ నాయకులు కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి జి. కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. వారు వెంటనే ఒడిశా ముఖ్యమంత్రితో చర్చించి అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులు, ఇతర పాలన పరమైన అడ్డంకులు తొలగిస్తూ తగిన ఉత్తర్వులు జారీ చేయించారు.

ఈ సమావేశంలో కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు మొగిలిపాక రవి, కార్పోరేట్ ఉపాధ్యక్షులు జీవి. కృష్ణారెడ్డి, ఊట్ల గణేష్, సంగం చందర్, నాగ ప్రసాద్, రాంసింగ్, వినయ్, సుందర్‌రావు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్' అన్ని విధాలా మేలు

(5వ పేజీ తరువాయి)

రైతుల కష్టం కూడా తక్కువే. పోడు భూముల్లో కూడా గిరివికాస్ కింద ఆయల్‌పామ్ సాగు ప్రోత్సహిస్తున్నాం. అడవులకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుకు అవకాశం ఉంటుంది. వరి వేసే రైతులను కూడా అయిల్‌పామ్‌కు మారిపోవాలని తద్వారా లాభాలు వస్తాయని వివరిస్తున్నాం.

ప్ర: జిల్లాలో గతంలో పండ్లతోటలు, మిర్చి ,పత్తి పంటలు సాగుకు డ్రిప్ ఇరిగేషన్ ఇచ్చారు? ఈ ఏడాది రైతులకు డ్రిప్‌పథకం అమలవుతుందా?

జ: గతంలో రైతులకు ఇచ్చిన మాట వాస్తవమే. ఆ తర్వాత ఈపథకం నిలిచిపోయింది. ఇప్పుడు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన మేరకు మళ్లీ రైతులకు ఈ పథకం అందిస్తుంది. పండ్ల తోటలతో పాటు మిర్చి, పత్తి కూరగాయలు, ఆయిల్‌పామ్ పంటలకు రైతులు డ్రిప్ కావాలంటే మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ పథకం అందిస్తున్నాయి. 5 హెక్టార్ల వరకు ఈ డ్రిప్ పథకం సబ్సిడీపై రైతులకు అందుతుంది. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, బీసీ సన్నకారు రైతులకు 90శాతంపైనా పెద్దరైతులకు 80శాతం సబ్సిడీపై అందిస్తున్నాం. ఈ ఏడాది 7500 ఎకరాల్లో రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందించాలని లక్ష్యం పెట్టుకున్నాం.

ప్ర: జిల్లాలో పండ్ల తోటల అభివృద్ధికి ఇచ్చే ప్రోత్సాహం?

జ: జిల్లాలో 30,200 ఎకరాల్లో మామిడితోటలున్నాయి. ఇంకా పలుచోట్ల జీడిమామిడి, నిమ్మ సాగవుతోంది. కూసుమంచి మండలం చేగొమ్మ వద్ద 16 ఎకరాల్లో నర్సరీ ఉంది. రైతులకు కొబ్బరి, వెదురు, తదితర మొక్కలు సబ్సిడీపై అందిస్తున్నాం. పండ్ల తోటలు సాగు చేసే రైతులకు 50శాతం వరకు మొక్కలు, ఎరువులు, పురుగు మందులు అందించడం జరుగుతుంది.

ప్ర: జిల్లాలో మల్బరీ సాగు పరిస్థితి ఎలా ఉంది?

జ: జిల్లాలో మల్బరీసాగు గతంలో అధికంగా ఉన్న తర్వాత వాతావరణ పరిస్థితులతో కొంత తగ్గింది. ప్రస్తుతం జిల్లాలో 150 ఎకరాల్లో మల్బరీ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మీకు కావాల్సిన మొక్కలు అందిస్తాం. షెడ్లు నిర్మించే రైతులకు ఎస్సీ, ఎస్టీ వారికి రూ.2.92.లక్షలు, ఇతరులకు రూ.2.25లక్షల సబ్సిడీ అందించడం జరుగుతుంది.

ఒక్క ఎకరం మల్బరీ సాగుకు రూ.78వేల వరకు ప్రభుత్వం ప్రోత్సాహకం ఇస్తుంది. ఈఏడాది మల్బరీ సాగును కూడా విస్తరించబోతున్నాం.

లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

- భద్రాద్ర ఎస్పీ రోహిత్‌రాజ్
- నూతన కరకట్ట నిర్మాణ పనుల పరిశీలన

కొత్తగూడెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాల దృష్ట్యా భద్రాచలం వద్ద గోదావరి నది వద్ద నీటి మట్టాన్ని పరిశీలిస్తూ పెరిగే క్రమంలో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం అధికారులకు సూచించారు. కూనవరం రోడ్డులో నూతనంగా నిర్మితమవుతున్న కరకట్ట నిర్మాణ పనులను పరిశీలించారు. అధికంగా వర్షాలు పడి వరదలు సంభవిస్తే ఇతరశాఖల అధికారులతో సమన్వయంతో పాటిస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎలాంటి పరిస్థితిని ఎదర్కొవడానికైన సన్నద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు.


పనులు పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

భద్రాచలం పోలీస్‌స్టేషన్ సందర్శన

రాబోయే వర్షాల దృష్ట్యా గోదావరి నది పరిసర ప్రాంతాలను పరిశీలించిన అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ భద్రాచలం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను తనిఖీచేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పలు కేసు వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గంజాయి రవాణా, గుట్కా, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన న్యాయ చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేయాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో పని చేసే సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంక్వార్, భద్రాచలం సీఐ సంజీవరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్, ఎస్ఐ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పాదచారులకు అందుబాటులోకి క్యూలైన్ షెడ్లు

రూ.కోటితో నిర్మించిన జీఎంఆర్ యాజమాన్యం


భక్తులకు అందుబాటులోకి వచ్చిన షెడ్లు

భద్రాచలం, జూలై 6: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం చుట్టూ ఉన్న మాడ వీధుల్లో ఇటీవల నూతనంగా నిర్మించిన క్యూలైన్ షెడ్లు శనివారం నుంచి పాదచారులకు అధికారికంగా అందుబాటులోకి వచ్చాయి. జీఎంఆర్ యాజమాన్యం సుమారు రూ.కోటితో షెడ్లను ఏర్పాటు చేసింది. వీటికి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, జీఎంఆర్ ప్రతినిధులు గంగాధర్, శ్రీనివాస్, రామకృష్ణరాజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అందుబాటులోకి తెచ్చారు. ఈ క్యూలైన్ల ఏర్పాటుతో రామాలయం పరిసరాల్లోని మాడ వీధులకు సరికొత్త శోభ సంతరించుకుంది. మాడ వీధుల్లోని తూర్పు, దక్షిణం, ఉత్తరం వైపు దేవస్థానం సూచన మేరకు భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ షెడ్లను జీఎంఆర్ యాజమాన్యం ఏర్పాటు చేసింది. వేసవి వర్షాకాలంలో భక్తులు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేలా ఈ షెడ్ల నిర్మాణం చేపట్టడం జరిగింది. ఇందులో రాత్రి సమయంలో సైతం భక్తులు రాకపోకలు సాగించేందుకు ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. కాగా మాడ వీధుల్లో క్యూలైన్ షెడ్ల ఏర్పాటుతో ఆలయంకు పరిసరాలకు సరికొత్త అందం సంతరించుకొందని భక్తులు స్థానికులు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నారు.

సింగరేణిలో ఉద్యోగాల భర్తీకి అంతర్గత రాత పరీక్ష

కొత్తగూడెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇన్‌స్పెక్టర్, టీఅండ్ఎస్ గ్రేడ్ డి పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేసేందుకు శనివారం సింగరేణి మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. జీఎం (సెక్యూరిటీ) జీఎం (పర్సనల్) వెపల్ఫేర్ ఆర్‌సీ బీఆర్. దీక్షితులు పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షా విధానాన్ని పరిశీలించారు. 5 ఖాళీలకు అర్హులైన 27 అభ్యర్థులకు హాలు టికెట్లు జారీ చేయగా 26మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఈ రాత పరీక్ష సెక్యూరిటీ, విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో, సిసి కెమెరాల నిఘా మధ్య నిర్వహించడం జరిగిందని, ఈ పరీక్ష పూర్తిగా సీనియారిటీ, మెరిట్‌పై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో డీజీఎం (పర్సనల్) పి. వేణుగోపాలరావు, డీజీఎం (విజిలెన్స్) వీఎన్‌వీఎస్‌ఆర్. శాస్త్రీ, ఎస్‌వోటు జీఎం సెక్యూరిటి జి. వేణుమాధవ్, ఏరియా సెక్యూరిటి ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, పర్సనల్ మేనేజర్ కే. ప్రకాశరావు, డీవైపీఎంలు నాగేశ్వరరావు, సంతోష్‌కుమార్, మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శారద, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముదిగొండలో నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ముదిగొండ, జూలై 6: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క ఆదివారం ముదిగొండ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. మండలంలోని వల్లాపురం, గంధసిరి, పెద్దమండవ, బాణాపురం, వల్లభి, మల్లారం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు తెలిపారు.

వనమహోత్సవంలో అగ్రభాగాన నిలవాలి

● అటవీ సంరక్షణ ముఖ్య అధికారి ప్రియాంకవర్గీస్

ఖమ్మం, జూలై 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వన మహోత్సవంలో ఖమ్మం జిల్లా రాష్ట్ర స్థాయిలో ముందు నిలవాలని, జిల్లాలో 31.06లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర అటవీ సంరక్షణ ముఖ్య అధికారి ప్రియాంక వర్గీస్ పేర్కొన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌ను కలిసి వనమహోత్సవంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి ఆమె మాట్లాడారు. లక్ష్యసాధనే కాకండా నాణ్యతగా మొక్కలు పెంచేందుకు చొరవ తీసుకోవాలని, ఏప్రాంతంలో ఏ మొక్కకు అనువుగా నేల ఉంటే అదుకు అనువైన మొక్కలు వేయాలని సూచించారు. వర్షాలు పడే తరుణంలోనే మొక్కలు వేస్తే వేసిన మొక్కలన్ని బతుకుతాయని ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున వేగవంతంగా చేపట్టాలని,ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో పాటు అన్నివర్గాల వారిని ఈ కార్యక్రమంలో బాగస్వాములు చేయాలని కోరారు. సింగరేణితోపాటు పలురకాల పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీస్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో మునగ, నిమ్మ, కరివేపాకు మొక్కలు కచ్చితంగా వేయాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంగా వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేస్తామని, జిల్లాలో 31.06లక్షల మొక్కలు నాటుతామని,అటవీశాఖ ద్వారా 7.60లక్షలు, డీఆర్‌డీఏ ద్వారా 10లక్షలు, నీటిపారుదలశాఖ 1.06లక్షలు, వ్యవసాయశాఖ 2.70లక్షలు, హార్టికల్చర్ ద్వారా 1.80లక్షలు, ఎక్సైజ్ శాఖ ద్వారా 60వేలు, మునిసిపాలిటీలు 4.78లక్షలు, విద్యాశాఖ 30వేలు, పరిశ్రమల శాఖలో 30వేలు, గనుల శాఖ 60వేలు, సింగరణి ద్వారా 1.32లక్షలు మొక్కలు నాటే కార్యక్రమం రూపొందించామని తెలిపారు. జిల్లా అటవీ శాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2015 నుంచి మొక్కలు నాటేకార్యక్రమం చేపట్టడం జరిగిదని తెలిపారు. ఈసమావేశంలో స్థానిక సంస్థల అదనపు ఇన్‌చార్జి కలెక్టర్ డీఆర్‌డీవో సన్యాసయ్య జడ్పీ సీఈవో వినోద్, డీపీవో హరికిషన్, అధికారులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సంస్కారమూ ముఖ్యం

● రిటైర్డు ఐపీఎస్ లక్ష్మీనారాయణ

ముదిగొండ, జూలై 6: విద్యార్థులకు విద్య ఒక్కటే కాదు... చదువుతోపాటు సమాజంలో సంస్కారం కూడా అవసరమని రిటైర్డు ఐపీఎస్ అధికారి వి.వి. లక్ష్మీనారాయణ అన్నారు. ముదిగొండ మండలం బాణాపురంలో శనివారం ఆవుల అమ్మిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఐఆర్ఎస్ ఆవుల భాస్కర్‌రెడ్డి 15జడ్పీఉన్నత పాఠశాలల్లో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి రూ.పదివేల చొప్పున రూ.8.50లక్షల ఉపకార వేతనాల చెక్కులను ఫౌండేషన్ ద్వారా అందజేశారు.

ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పించే బాధ్యత ఉపాధ్యాయులైతే సమాజంలో విధేయత, సంస్కారం నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ననాటి నుంచే సమాజంలో పెద్దలను గౌరవించడం నేర్పాలన్నారు. సమాజాన్ని శాసించే స్థాయికి ప్రతి విద్యార్థి ఎదగాలన్నారు. కత్తి ఎంత ప్రమాదమో సెల్‌ఫోన్ అంతకంటే ఎక్కువ ప్రమాదమని, జీవితాలను నాశనం చేస్తుంది, విద్యార్థులు సెల్‌ఫోన్‌ను అవసరమైన మేరకే వినియోగించుకోవాలని సూచించారు. మనం ఎవరమైనా, ఎక్కడ ఉన్నా, కన్నతల్లిని, పుట్టిన ఊరిని మర్చిపోకూడదన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రామాచారి, ఎస్ఐ గజ్జల నరేష్, ఎమ్మెల్సీ జనార్థన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న లక్ష్మీనారాయణ

నవ్వులరేడు 'గుణకర్'

- స్టాండప్ కమేడియన్‌గా, ఫన్నీ యాంకర్‌గా రాణిస్తున్న కళాకారుడు
- యూట్యూబ్ చానెల్ ద్వారా పాపులర్

ఖమ్మం సాంస్కృతికం, జూలై 4: స్టాండప్ కమెడియన్..... హాస్య ప్రక్రియలో ఈ పదం పాతదే అయినా ఇటీవల మరింత పాపులర్ అయింది.. టీవీ ఛానెళ్లు, కార్పొరేట్ సంస్థలు, మెట్రో నగరాలు స్టాండప్ కమెడియన్ల ప్రతిభను గౌరవిస్తుండటంతో నేటి తరం ప్రేక్షకులకు చేరువైంది.. స్టాండప్ షోలకు ముఖ్యంగా యువత ఫిదా అవుతుండటం పలు ఓటీటీల్లో స్టాండప్ కామెడీ కార్యక్రమాలను వీక్షిస్తుండటం తెలిసిందే. ఇదే కోవలో స్టాండప్ కమెడియన్‌గా రాణిస్తూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నాడు ఖమ్మంకు చెందిన మెగిలి గుణకర్.

పనిఒత్తిళ్లకు దూరంగా.. సరదా సంతోషాలకు దగ్గరగా గడపాలనుకునే వారికి తనవంతు సేవగా హాస్యాన్ని అందిస్తున్నాడు గుణకర్. ఆదివారం నాడు తనే సొంతంగా సరదా కార్యక్రమాలను ఏర్పాటు చేయటం ద్వారా.. ఇతరులు ఏర్పాటు చేసుకునే సభలు, సమావేశాలకు వెళ్లడం ద్వారా తన హాస్యంతో అలరిస్తున్నాడు. తాటిపూడికి చెందిన మెగిలి వెంకటేశ్వర్లు... తన కుమారుడి పేరునే స్క్రీన్ నేమ్‌గా మార్చుకొని మెగిలి గుణకర్‌గా మారాడు.

బీఏ బిఇడి చదివిన గుణకర్ సినిమాలపై వ్యామోహంతో కమెడియన్‌గా మారాడు.. కమెడియన్‌గా, ఫన్నీయాంకర్‌గా, పేరడీసింగర్‌గా ప్రక్రియ ఏదైనా హాస్యాన్ని అందించటం తన ప్రత్యేకత. సభలు, సమావేశాలు లేని రోజుల్లో ప్రత్యక్షకార్యక్రమాలు వీలు కాదుకనుక యూట్యూబ్‌లలో ప్రసారమైన తన కామెడీ వీడియోలను అందరికీ షేర్ చేస్తుంటాడు.. తాగుబోతుల తీరుపై తాను హాస్యంగా రాసిన పేరడీపాటలు విపరీతంగా వైరల్ అయ్యాయి.. సొంత యూట్యూబ్ ఛానెల్‌ను ఏర్పాటు చేసుకొని ప్రముఖుల ఇంటర్వ్యూలు సైతం నిర్వహిస్తుంటాడు.

1999లో హాస్యనటుడిగా రంగస్థలంపైకి వచ్చిన మెగిలి గతపాతికేళ్లుగా 3వేలకు పైగా ప్రదర్శనలిచ్చాడు. కళారంగంలో తనదైన ముద్రవేస్తూ ప్రేక్షకుల మనసుల్లో స్థానం దక్కించుకున్నాడు.. హాస్యప్రియులనే కాక ప్రముఖ స్టార్ కమెడియన్ బ్రహ్మానందం ప్రశంసలు పొందాడు.. ఇతర అనేకమంది సినీ ప్రముఖుల గౌరవానికి పాత్రుడవ్వటంతోపాటు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సన్మానం పొందాడు. యాక్టివ్ స్వచ్ఛంద సంస్థ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జానపద, సినీ హాస్య గీతాలను పాడటం, నాటికలను రూపొందించటం వంటి కార్యక్రమాల్లో పాల్గొనటం ద్వారా రంగస్థలానికి పరిచయమయ్యాడు.

అదే సమయంలో మల్లం రమేష్ అనే హాస్య కళాకారుడు టాకింగ్ డాల్ తదితర ప్రక్రియల్లో హాస్యాన్నిసృష్టిస్తూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుండటం గమనించి ఆయన బృందంలో సభ్యుడిగా చేరటం ద్వారా తన ప్రతిభను మెరుగుదిద్దుకున్నాడు.. క్రమంగా స్టాండప్ కమెడియన్‌గా ప్రత్యేక ప్రదర్శనలు ఇవ్వటం ప్రారంభించాడు. స్టాండప్ కామెడీనే కాక పలు కళా రంగ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ సమయస్ఫూర్తితో సందర్భానుసారం హాస్యాన్ని పండించటం తన ప్రత్యేకత..

నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించిన గుణకర్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేక కష్టాలను ఎదుర్కొంటున్నాడు. గుండెల్లో ఎంతటి బాధ ఉన్నప్పటికీ ముఖంలో నవ్వులు పూయిస్తూ ప్రేక్షకుల బాధలను దూరం చేస్తున్నాడు.. హాస్య కార్యక్రమాలలోనే కాక టీవీ సీరియళ్లు, షార్ట్‌ఫిల్మ్‌లు, సినిమాల్లో హాస్యనటుడిగా నటిస్తూ మెప్పిస్తున్నాడు. 2016లో జీ తెలుగులో కామెడీ కిలాడీలు అనే కార్యక్రమం ద్వారా టెలివిజన్ స్టాండప్ కామెడీ కార్యక్రమాల్లో కాలు మోపాడు. 2018లో స్టార్ మా టెలివిజన్ ఛానెల్లో ప్రసారమైన ఢీ లెట్ దాన్స్ అనే హాస్య కార్యక్రమంలో మరో హాస్యకళాకారుడు బుల్లెట్ సుధీర్‌తో కలిసి విన్నర్‌గా నిలిచి ప్రముఖ సినీహాస్యనటుడు బ్రహ్మానందం ప్రత్యేక ప్రశంసలు పొందటంతో పాటు నాలుగు లక్షల నగదు బహుమతి అందుకున్నాడు.

అతడు వాడు మెగా బ్రదర్ నాగబాబు తన యూట్యూబ్ చానెల్ కోసం ఏర్పాటు చేసిన ఖుషీఖుషీగా అనే కామెడీ కార్యక్రమంలో ప్రతిభను నిరూపించుకున్నాడు. జబర్దస్త్, స్మైల్ రాజా స్మైల్ తదితర హాస్యకార్యక్రమాల్లో సైతం నటించాడు.. దర్శకుడు తేజ దర్శకత్వంలో వచ్చిన నీకు,నాకు డాష్ డాష్ అనే సినిమాతోపాటు అమ్మాలు, ఆ అయిదుగురు, రిషి, తదితర సినిమాల్లో నటించాడు. వీటితోపాటు పలు షార్ట్‌ఫిల్మ్‌లలో నటించటంతోపాటు దర్శకత్వం వహించాడు. స్వచ్ఛభారత్ పై తాను రూపొందించిన బర్త్‌డే గిఫ్ట్ అనే షార్ట్‌ఫిల్మ్ బహుమతి పొందింది.దళిత బంధు పథకంపై రూపొందించిన యాడ్ ఫిల్మ్‌లో నటించాడు. తనభార్య కవిత, ఇతర కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో కళా రంగంలో రాణిస్తున్నానని సినీ కమెడియన్‌గా పేరు తెచ్చుకోవాలన్నదే తన ఆశయమని గుణకర్ తెలిపారు.


మెగిలిని అభినందిస్తున్న బ్రహ్మానందం

'ఎప్‌సెట్' సర్టిఫికెట్ల పరిశీలన షురూ

● తొలి రోజు 800 మంది విద్యార్థుల హాజరు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 6: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు గాను శనివారం నుంచి మెదటి దశ ఎప్‌సెట్ కౌన్సిలింగ్ నగరంలోని ఎస్ఆర్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైంది. మెదటి రోజు 800 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హజరైనట్లు కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. మెదటి దశలో ఈ నెల 12 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్, 6 నుంచి 13 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 8 నుంచి 15 వరకు ఆప్షన్స్ ఫ్రీజింగ్, 19న సీట్ల కేటాయింపు ఉంటుంది. 26 నుంచి రెండో దశ కౌన్సిలింగ్ ప్రారంభం కానుంది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో భాగంగా ఎప్‌సెట్‌లో 10వేల లోపు ర్యాంకు వచ్చినవారికి ఏ కాలేజీలో సీటు వచ్చినా పూర్తి ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఏ కులం వారికైనా ఇది వర్తిస్తుంది. పదివేల పైన ర్యాంకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు తమ కుటుంబ ఆదాయం ప్రభుత్వం నిర్ణయించిన స్థాయికంటే తక్కువ ఉన్నదని ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే పూర్తి ఫీజును ప్రభుత్వం చెల్లిసుంది. పదివేల పైన ర్యాంకు వచ్చిన బీసీ విద్యార్థులకు రూ.35 వేల ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా చెల్లిస్తుండగా, మిగతా ఫీజును విద్యార్థులే భరించాలి.

తాజా నిర్ణయం ప్రకారం సర్కారు కాలేజీల్లో చదివిన ఏ కులం విద్యార్థులకైనా ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రభుత్వ కాలేజీలతోపాటు, రెసిడెన్షియల్ స్కూళ్లు, గురుకులాలు, కార్పొరేట్ కాలేజీ స్కీమ్‌లలో లబ్ధిపొందిన విద్యార్థులకు కూడా ఈ పథకం వర్తించనుంది. వీరు కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. కుటుంబ వార్షికాదాయం ప్రభుత్వం నిర్ణయించిన స్థాయికి మించి ఉంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు.

పలు సూచనలు చేసిన ఎప్‌సెట్ కోఆర్డినేటర్

వెబ్ ఆప్షన్లు పెట్టుకునే సమయంలో వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇచ్చుకోవాలని, ర్యాంకులకు సంబంధించి గత ఏడాది ఏఏ కళాశాలల్లో సీట్లు వచ్చాయో, ముందుగా తెలుసుకుని ఆప్షన్లు ఇచ్చుకోవాలని ఎప్‌సెట్ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. ఆప్షన్లు పెట్టుకునే సమయంలో ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్ కంప్యూటర్లు మాత్రమే వాడాలని, సెల్‌ఫోన్ల ద్వారా ఆప్షన్లకు ప్రయత్నిస్తే తప్పులు దొర్లే అవకాశం ఉందన్నారు. సీట్ అలాట్‌మెంట్ జరిగిన తర్వాత ఆన్‌లైన్‌లో ఫీజును చెల్లించాలని, దీనికి విద్యార్థి సొంత బ్యాంకు అకౌంట్ నుండి ఫీజు చెల్లించాలని లేదా తల్లిదండ్రుల అకౌంట్ ద్వారా చెల్లించాలని సూచించారు. నెట్‌సెంటర్ల ద్వారా ఎట్టి పరిస్థితుల్లో ఫీజు చెల్లించవద్దని సూచించారు. విద్యార్థులకు ఫీజులు తిరిగి వచ్చే అవకాశం ఉన్నప్పుడు అదే బ్యాంకు అకౌంట్‌కు అమౌంట్ వస్తుందని, కావున విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకుని వారి సొంత అకౌంట్ల ద్వారానే ఫీజులు చెల్లించాలని సూచించారు.

భద్రాద్రి జిల్లాలో 450 మంది హాజరు

చుంచుపల్లి, జూలై 6: ఇంజనీరింగ్ విద్యలో ప్రవేశాలకు గాను టీజీఎప్‌సెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ భద్రాద్రి జిల్లాలో శనివారం ప్రారంభమైంది. రుద్రంపూర్ హెల్ప్‌లైన్ సెంటర్ నందు తొలిరోజు 450 మంది అభ్యర్థులు దృవపత్రాల పరిశీలకు హాజరయ్యారు. ఈ నెల 13వ తేదీ వరకు దృవపత్రాల పరిశీలన కొనసాగుతుందని అభ్యర్థులు సకాలంలో చేరుకొని వెరిఫికేషన్ చేసుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బీ నాగమునినాయక్ తెలిపారు.


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

తగ్గిన ఎరువుల భారం

- రెండు రకాలపై ధరల తగ్గింపు
- పొటాష్, అమ్మోనియాకు వర్తింపు


ఖమ్మం వ్యవసాయం, జూలై 6: గత ఏడాది అక్టోబరు మాసంలో ఎరువుల కంపెనీలు కాంప్లెక్స్ ఎరువుల ధరలను ఒక్కసారిగా పెంచేశాయి. కంపెనీలు కాం ప్లెక్స్ ఎరువుల ధరలను 35శాతం నుంచి 50శాతం వరకు అంటే రూ.200 నుంచి రూ.900వరకు పెంచేశాయి. కేంద్ర ప్రభుత్వం ఎరువుల కంపెనీలపై నియంత్రణ ఎత్తివేయడంతో పాటు సబ్సిడీని ఎత్తివేదయడంతో కంపెనీలు ఇష్టానుసారం ధరలు పెంచుతూ పోతున్నాయి. అయితే తాజాగా రెండు రకాల ఎరువులపై ధరలను తగ్గించాయి. పంటలకు నామమాత్రంగా మద్దతు ధర పెంచిన కేంద్రం, మరోవైపు ఎరువులపై ఎడాపెడా జీఎస్టీ విధించడంపై అన్నదాతల్లో ఆవేదన వ్యక్తం అవుతోంది. తాజాగా రెండు రకాలపై మాత్రమే ధరలు తగ్గించడంపై వారు పెదవి విరుస్తున్నారు. జిల్లాలో యూరియా 77వేల 959 మెట్రిక్ టన్నులు, డీఏపీ 17వేల మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 7వేల 450 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరెవులు 76వేల 648 మెట్రిక్ టన్నులు వినియోగించే అవకాశం ఉంది.

కరోనాకు ముందు 50 కిలోల బస్తా పొటాష్ ధర రూ.970 మాత్రమే. ఉక్రెయిన్, రష్యా యుద్ధం తర్వాత దీని ధర ఏకంగా రూ.1,700కి ఎగబాకింది. జిల్లాలో 90 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. సాగు గిట్టుబాటు కాకపోవడం, ధరలు పెరగడంతో గత రెండేళ్లుగా ఎరువుల వాడకాన్ని సగానికి పైగా తగ్గించారు. పొటాష్ ధరలు ఇటీవల అంతర్జాతీయంగా తగ్గుముఖం పట్టాయి. దీంతో కంపెనీలు బస్తా ధరను రూ.1,550కి తగ్గించి తాజాగా డీలర్లకు సరఫరా చేస్తున్నాయి. అమ్మోనియా 50 కిలోల బస్తా ధర గతంలో రూ.1,000 ఉండగా ప్రస్తుతం దీన్ని రూ.925కి తగ్గించాయి. వాడకం ఎక్కువగా ఉన్న మిగతా కాంప్లెక్స్ ఎరువులను గతేడాది పాత ధరలకే విక్రయిస్తున్నారు. ఇంకోవైపు రాయితీ ఎరువులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 5 శాతం చొప్పున విధిస్తున్న జీఎస్టీ భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎరువుల ధరలు ఇలా...

50 కిలోల బస్తాకు కంపోస్టు ఎరువు 400, 16-16-16 ధర రూ.1375, యూరియా 45కిలోలు రూ. 266.5, డీఏపీ 1350, ఎస్ఎస్‌పీ 615, అమ్మోనియం సల్ఫేట్ 925, ఎంఓపీ-1550, 24-24-0 ధర రూ. 1700, 10-26-26 ధర రూ.1470, 28-28-0 ధర రూ.1700గా ఉంది. అయితే దీనికి జీఎస్టీ 5 శాతం అధికంగా చెల్లించాలి.

బావిలోపడి వృద్ధుడి మృతి


రాజమహ్మద్

అన్నపురెడ్డిపల్లి, జూలై 6: బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నపురెడ్డిపల్లికి చెందిన షేక్ రాజ మహ్మద్(70) కొంత కాలంగా మానసిక రుగ్మతతో బాధ పడుతున్నాడు. ఈ నెల 3న ఉదయం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ తెలియరాలేదు. శనివారం పొలం పనులకు వెళ్లిన ఓ రైతుకు బావిలో మృతదేహం కనిపించడంతో గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయగా రాజమహ్మద్‌గా గుర్తించారు. మానసిక రుగ్మతతో ఆత్మహత్య చేసుకున్నాడా, లేక ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

సుజాతనగర్, జూలై 6: పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కాగా ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్‌ఐ జుబేదా బేగం తెలిపిన వివరాల ప్రకారం.. పాత అంజనాపురం గ్రామానికి చెందిన సింధు(27) అనే మహిళకు అదే గ్రామానికి చెందిన మర్రా రాజుతో గతంలో వివాహం జరిగింది. రెండు రోజుల క్రితం వేరే కాపురం పెట్టుకుందామని భర్త తెలపడంతో ఇరువురి మధ్య వివాదం చోటు చేసుకుంది. మనస్తాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కొత్తగూడెం తరలించారు. చికిత్స చేస్తుండగా ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


లక్ష్మయ్య (ఫైల్)

అన్నపురెడ్డిపల్లి, జులై 6: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. జానకీపురం గ్రామానికి చెందిన పిట్టల లక్ష్మయ్య(40) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న 3ఎకరాల పొలంతో పాటు మరికొంత కౌలుకు తీసుకోని వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయంలో దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. అప్పులు మితి మిరడంతో తీర్చలేమోనని భయంతో తీవ్ర మనస్తాపానికి గురై పొలంలోని పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు పెనుబల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తల్లి మందలించిందని యువతి...

అశ్వాపురం, జూలై 6: తల్లి మందలించిందని మనస్తాపానికి గురై యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని పాములపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాములపల్లి గ్రామానికి చెందిన కోరం కృష్ణవేణి(23) యువతి ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంట్లో ఉంటోంది. పని విషయపై తల్లి మందలించడంతో శుక్రవారం సాయంత్రం ఇంటో పురుగుల మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు యువతిని చికిత్స నిమిత్తం మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవపడి భర్త ...

దుమ్ముగూడెం, జూలై 6: భార్యతో గొడవపడిన భర్త క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని పెదకమలాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెదకమలాపురానికి చెందిన వర్సా సాయిబాబు(20)కు రెండు రోజులుగా తన భార్యతో గొడవలు జరుగుతున్నాయి. కాగా ఈనెల 5న తన పొలం వద్దకు వెళ్లిన అతడు పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న గమనించిన సమీప రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకు ఎదురెళ్లి వ్యక్తి...



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై6: రైల్వే ట్రాక్‌పై వెళుతున్న రైలుకు ఎదురెళ్లి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్డు)లో శనివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనపై రైల్వే జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్‌ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం..కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్డు) నుంచి డోర్నకల్ వెళ్తున్న మణుగూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఎదురుగా, హేమచంద్రాపురం రైల్వే గేట్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి వెళ్లి శుక్రవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, చామనయ రంగు, కోల ముఖము, బట్టతల, నలుపు, తెలుపు రంగు టీషర్ట్‌ను, తెలుపు రంగు పాయింట్ ధరించి ఉన్నాడని వివరాలు వెల్లడించారు. మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589, 94947 90619 నెంబర్లకు సమాచారం అందజేయాలన్నారు.

మనస్తాపంతో ఒకరు....

మధిరరూరల్, జూలై 6: భార్యభర్తల మధ్య జరిగిన చిన్న వివాదం కారణంగా మనస్తాపానికి గురై ఓ వ్యక్తి క్షణికావేశంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రాయపట్నం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోట లక్ష్మణ్‌రావు(45) భార్యతో గొడవపడి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అతడు ఎంతకు బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపు తెరిచి చూడగా ఉరివేసుకొని ఉండటాన్ని గుర్తించి, స్థానికుల సహాయంతో కిందకు దించి మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే లక్ష్మణ్‌రావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. ఈమేరకు మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి, కుమార్తెకు పాముకాటు...

● కుమార్తె పరిస్థితి విషమం ● సుర్దేపల్లిలో ఘటన


తల్లీకుమార్తెను కాటువేసిన పాము

నేలకొండపల్లి, జూలై6: తల్లీ, కుమార్తెలను పాము కాటు వేసిన సంఘటన మండల పరిధిలోని సుర్దేపల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుర్దేపల్లి గ్రామానికి మారపొంగు పుల్లయ్య, రాధ, కుమార్తె దీవెనలు కింద చాపవేసుకుని నిద్రిస్తున్నారు. నిద్రిస్తున్న సమయంలో పెద్ద కట్ల పాము తల్లి రాధ, కూతురు దీవెనలను కాటు వేసింది. వెంటనే గమనించిన వారు పెద్దగా కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి పామును చంపివేశారు. పాము కరిచిన వారిని చికిత్స నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. కాగా దీవెనను మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించినట్లు తెలుస్తున్నది.

ద్విచక్ర వాహనం దగ్ధం

● ఖమ్మం నగరంలో ఘటన

ఖమ్మంక్రైం, జూలై6: గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన శనివారం తెల్లవారుజామున ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైరా రోడ్డు సమీప ప్రాంతంలో ఇద్దరు యువకులు గదిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. వారు నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో కాంపౌండర్లుగా పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి వారి నివాసం ఉంటున్న ఇంటి ముందు ద్విచక్రవాహనాన్ని నిలిపారు. కాగా తెల్లవారుజామున సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. కొంత సేపటి తరువాత స్థానికులు గమనించి కేకలు వేయడంతో యువకులు వచ్చి మంటలు ఆర్పారు. ఇదంతా వారు ఉంటున్న ఇంటిలోని మరో పోర్షన్‌లో ఉండే యువకులే చేస్తున్నారని బాధిత యువకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇరువురిపై కేసు నమోదు చేస్తామన్న పోలీసులు

గత కొద్దిరోజుల క్రితం వారు నివాసం ఉంటున్న మరో పోర్షన్ వారికి సదరు యువకులకు ఘర్షణ జరిగింది. దీంతో అది మనసులో పెట్టుకున్న వారు ఇదంతా చేస్తున్నారని, బాధిత యువకులు ఆరోపిస్తున్నారు. ఈఘటనపై గతంలో ఆ ఇంటి యజమాని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పక్క పోర్షన్ వారిని ఖాళీ చేయాలని సూచించి పంపించారు. మళ్లీ గత మూడు రోజుల నుంచి ద్విచక్రవాహనం దగ్ధం చేయడం వంటి సంఘటనలు జరుగుతుండడంతో సదరు బాధిత యువకులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. దీంతో స్టేషన్‌లో మీ ఇద్దరిపై కేసులు నమోదు చేస్తాం, ఆధార్‌కార్డులు తీసుకొని సోమవారం రావాలంటూ సూచించి పంపించారు. దీంతో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన మాపై కేసులు పెట్టడం ఏంటంటూ సదరు యువకులు వాపోతున్నారు. ఈఘటనపై కేసు పరిశీలిస్తున్న అధికారిని వివరణ కోరగా గతంలో జరిగినవి తనకు తెలియదని, కొత్తగా వచ్చాను, వారి ఫిర్యాదు మేరకు గతంలో విధుల్లో ఉన్న బ్లూకోట్స్ సిబ్బంది చెప్పిన గొడవ విషయంపై ఇరువురిపై కేసులు పెడతామని చెప్పామని, అందులో భాగంగానే సోమవారం ఆధార్‌కార్డులు తీసుకుని రమ్మని చెప్పామని సదరు అధికారి తెలిపారు.

గంజాయి వ్యసనం వీడాలని...

» ఇద్దరు యువకులకు తల్లిదండ్రుల దేహశుద్ధి
» అనంతరం పోలీసులకు అప్పగింత
» గంజాయి రవాణాకు బాలుడి వినియోగం..


గంజాయికి బానిసైన కొడుకుని కొడుతున్న తల్లి

చంద్రుగొండ, జులై 6: చేతికి అందివచ్చిన యువకులు గంజాయి తాగుతూ జీవితం నాశనం చేసుకుంటున్నారనే ఆవేదనతో కుటుంబ సభ్యులు వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తుంగారం పంచాయతిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం...తుంగారం శివారు వెంగళరావు కాలనీలో భగవాన్ అనే వ్యక్తి ఇంట్లో తమ కొడుకులు గంజాయి తాగుతున్నారని తెలుసుక్ను టేకుల బంజర్ గ్రామానికి చెందిన గుగులోత్ రాందాస్, తుంగారం గ్రామానికి చెందిన జమున కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో వచ్చి యువకులు ఉన్న ఇంట్టిని చుట్టుముట్టారు. అప్పటికే గంజాయి సేవిస్తు యువకులు గుగులోత్ సాయి సందీప్, జర్పులా మనోజ్‌కుమార్ తమ వద్ద ఉన్న గంజాయిని వదిలి పారిపోయే ప్రయత్నం చేశారు. తల్లిదండ్రులు గ్రామస్థుల సహకారంతో యువకులను పట్టుకొని దేహశుద్ధి చేశారు. కాగా మత్తులో ఉన్న యువకుడు మనోజ్‌కుమార్ గ్రామస్థులపై దాడికి పాల్పడాడు. ఇదిఇలాఉండగా 7 వతరగతి చదువుతు్న బాలుడు కూడా యువకులతో కలిసి ఉన్నాడు. ఈ మైనర్ బాలుడిని గ్రామస్తులు నిలదీయటంతో టీవీఎస్ ద్విచక్ర వాహనంపై రోజు కొత్తగూడెం వెళ్లి గంజాయి తీసుకువస్తున్నట్లు ఆ బాలుడు గ్రామస్థులకు తెలిపాడు. కాగా గంజాయి స్థావరంగా ఉన్న ఇంట్లోనే గుడుంబా బట్టీ ఉండటాన్ని గ్రామస్తులు గుర్తించారు. సంఘటన విషయాన్ని పోలీసులకు తెలపటంతో పోలీసులు వచ్చి ఇద్దరు యువకులతో పాటు బాలుడిని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

మూడేళ్లుగా మత్తులో జోగుత్ను యువకులు..

ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న గుగులోత్ రాందాస్ కొడుకు సాయి సందీప్ ఇతనికి 23 సంవత్సరాలు. కూలీపనులు చేసుకొనే సాయిసందీప్‌కు 20 సంత్సరాల వయసులోనే వివాహమైంది. ఇతనికి ఒక కుమార్తె, కాగా వివాహం అయిన నాటి నుంచి గంజాయి, మద్యం మత్తులో వచ్చి భార్యను వేదింపులకు గురిచేస్తున్నాడు. భార్య గర్భిణిగా ఉన్న సమయంలో నిత్యం చిత్రహింసలు పెట్టావాడు. దీంతో గత అగస్టులో సాయిసందీప్ తల్లిదండ్రులు పోలీసులతో పాటు 'ఆంధ్రజ్యోతి'ని ఆశ్రయించారు. దీంతో పోలీసులు స్పదించి సాయిసందీప్‌ను కొద్దిరోజులు స్టేషన్‌కు పిలిసి కౌన్సిలింగ్ ఇవ్వటంతో కొంతకాలం గంజాయికి దూరంగా ఉన్న సందీప్ తిరిగి పూర్తిగా మత్తులో మునిగిపోయాడు.

ఇక మనోజ్‌కుమార్ తల్లి జమున తుంగారంలో చిన్న హోటల్ నడపుకుంటూ జీవనం సాగిస్తుండగా, కూలిపనులు చేసుకునే 24 సంవత్సరాల మనోజ్‌కుమార్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. మనోజుకుమార్ గంజాయికి బానిసకావటంతో ఇటీవల భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇదిఇలా ఉండగా మైనర్ బాలుడి తల్లితండ్రులు ఇద్దరు గంజాయి, గుడుంబాకు బానిసలైయ్యారు. మైనర్ తల్లి భర్తతో గొడపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది.

తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఆలోచనతోనే పోలీసులకు యువకులను అప్పగించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. తమ కొడుకులను జైలుకు పంపాలని పోలీసులను కోరుతున్నామని, జైల్లో ఉంటే వారిలో మార్పు వస్తుందనే ఆశతోనే జైల్లో ఉండాలని కోరుకుంటున్నామని తల్లిదండ్రులు కన్నీటి పర్వతమయ్యారు. పంచాయతీలో మరో 30 మంది గంజాయికి బానిసయ్యారని, వారిపైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మొక్కలతోనే సంపూర్ణ ఆరోగ్యం

● కలెక్టర్ జితేష్ వీ పాటిల్

చుంచుపల్లి, జూలై 6: మొక్కలతోనే ప్రతీ ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం అందుతుందని, అందుకు బాధ్యతగా విధిగా మొక్కలు నాటాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం మండలంలోని రుద్రంపూర్ గ్రామ పంచాయతీ నందు గల జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ నందు వన మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని వీబీపీ ప్లాంటేషన్, కిచెన్ గార్డెన్ మొక్కలను నాటారు. ఈ పాఠశాల ఆవరణలో మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణ మొక్కల పరిరక్షణ హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి మాట్లాడారు. పాఠశాల ఆవరణలో కరివేపాకు, మునగ, వెలగా, చింత, పూల మొక్కలు, మహావృక్షాలకు సంబంధించినవి అన్ని రకాలు, పాఠశాల నందు పిల్లలకు వంటకు పనికొచ్చే మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యాచందన, చుంచుపల్లి ఎంపిపి బాదావత్ శాంతి, ఎంపిటిసిలు పరమేశ్వర్, ఆర్తి మర్నాడ్, ఎంపిడివో అశోక్‌కుమార్, ఎంపివో గుంటి సత్యనారాయణ, ఎంఈవో జుంకీలాల్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వై.చెన్నకేశవ, ఉపేందర్, ఈజీఎస్ ఏపీవో రఘుపతి, ఈసీ పిల్లి నాగరాజు, టిఏలు అనిల్‌కుమార్, యశ్వంత్, కోటేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు కేస్లీ, ఆదినారాయణ, దేవదాస్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బాలాజీ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ సంఘ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 6: తెలంగాణ రాష్ట్ర సీనియర్ పురుషులు, మహిళల ఇంటర్ డిస్ట్రిక్ట్ పవర్‌లిఫ్టింగ్ పోటీలు శనివారం నగరంలోని టీఎన్‌జీవోస్ ఫంక్షన్‌హాలులో ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను సౌత్ ఇండియా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ కోటేశ్వరరావు, రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌గౌడ్, జోసఫ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తనయుడు సాయినిఖిల్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. నగరంలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నట్లు రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ సంఘ బాధ్యులు తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు నిర్వాహకులు ఉచిత భోజన వసతి ఏర్పాట్లను కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌస్ పాషా, సెక్రెటరీ మనోజ్‌కుమార్, మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు, క్లాసిక్ జిమ్ నిర్వాహకులు నగీనాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సీ కథ, కవిత్వ పోటీల విజేతల ఎంపిక

ఖమ్మంసాంస్కృతికం, జూలై 6: హాసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ (హెచ్‌ఆర్‌సీ) జాతీయ స్థాయిలో నిర్వహించిన కథలు, కవిత్వ పోటీల ఫలితాలను ఫౌండేషన్ అధ్యక్షురాలు తోట సుభాషిణి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.. కథల విభాగంలో మొదటి బహుమతి మధు పత్ర శైలజ (హైదరాబాద్), ద్వితీయ బహుమతి రాచమళ్ల ఉపేందర్(ఖమ్మం), తృతీయ బహుమతి పొత్తూరి సీతారామ రాజు (కాకినాడ), కన్సోలేషన్ బహుమతులు బి. కళాగోపాల్ (నిజామాబాద్), బీవీ ప్రసాద్ (విజయవాడ), కవిత్వ విభాగంలో మొదటి బహుమతి బీవీ ప్రసాద్ (విజయవాడ), ద్వితీయ బహుమతి నాగజ్యోతి శేఖర్ (కాకినాడ), తృతీయ బహుమతి కటుకోజ్వల రమేష్ (ఖమ్మం), కన్సోలేషన్ బహుమతులు సాంబమూర్తి లండ (శ్రీకాకుళం), తెలుగు వెంకటేష్ (కర్నూల్) గెలుచుకున్నారని తెలిపారు. కవిత్వ విభాగంలో ప్రముఖ కవులు యాకూబ్, సీవీ సురేష్, అనిల్ డానీ, వైష్ణవశ్రీలు, కథల విభాగంలో పెద్దింటి అశోక్ కుమార్, సిరంశెట్టి కాంతారావు, వెంకటకృష్ణ, శ్రీఊహలు జ్యూరీ సభ్యులు గా వ్యవహరించి విజేతలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. విజేతలకు ఈనెల 13న ఖమ్మంలోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగే సభలో బహుమతులను అందజేస్తామని చెప్పారు. ఇదే సభలో ప్రముఖ కవి ఆశారాజుకు హెచ్ ఆర్ సీ 2024 సాహిత్య పురస్కారం అందజేస్తామన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 6: నగరంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25వార్షిక విద్యా సంవత్సరానికి గాను పలు సబ్జెక్టులలో బోధించడానికి అరు లైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా శనివారం తెలిపారు. తెలుగు-1, పొలిటికల్ సైన్స్ -1, బిజినెస్ అనలిటిక్స్ -1, బీబీఏ-1, స్టాటిస్టిక్స్ -1, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్-7 ఖాళీలున్నాయని పేర్కొన్నారు. కళాశాల కమిషనర్ ఉత్తర్వులు ననుసరించి, సంబంధిత సబ్జెక్టులో జనరల్ అభ్యర్థులకు 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులతో పాటు, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. దరఖాస్తులతో పాటు సంబంధిత ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలను ఈనెల 9వ తేదీన కళాశాల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. 10న కళాశాల ప్రాంగణంలో జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు .

సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ అసిస్టెంట్ కమాండోగా వంశీ



తిరుమలాయపాలెం, జూలై6: మండలంలోని కాకరవాయి గ్రామానికి చెందిన కొత్తపల్లి కుశీల్ వంశీ శుక్రవారం ప్రకటించిన సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫలితాల్లో ఆలిండియాలో 71 వర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన కొత్తపల్లి శివకుమార్ రేణుక దంపతుల కుమారుడు వంశీ ఎస్‌ఐ, ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. వాటికి ఇష్టంలేక నేడు ఈ ఉద్యోగం సాధించాడు. తన లక్ష్యం సివిల్ సాధించడమే తన ధ్యేయమన్నారు. పేద కుటుంబంలో పుట్టి ఉన్నత చదవులు చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించిన వంశీకి గ్రామస్థులు, కుటుంబసభ్యులు అభినందిచారు.

మరుగుదొడ్ల బిల్లులు

గ్రామ సభపెట్టి చెల్లిస్తాం: అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామేపల్లి, జూలై 6: "మరుగుదొడ్ల బిల్లులు హంపట్" అనే శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో ఓ కథనం ప్రచురణ అయిన విషయం విధితమే... దీనికి స్పందించిన నెమలిపురి పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు గ్రామంలో మరుగుదొడ్ల బిల్లును గ్రామ సభ పెట్టి లబ్ధిదారులకు చెల్లిస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన వీడబ్ల్యూఎస్‌సీ ఖాతాలో బిల్లులకు సంబంధించిన నగదు ఉన్నది అని పేర్కొనాడు.

వ్యక్తిపై కత్తితో దాడి

చుంచుపల్లి, జూలై6: వ్యక్తిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని పారిశ్రామిక ప్రాంతమైన గౌతంపూర్ పంచాయతీలో ఈశ్వర్, రమేష్ అనే వ్యక్తులు వేరు వేరుగా సింగరేణి క్వార్టర్స్‌లో ఒకే ప్రాంతంలో తమ కుటుంబాలతో నివసిస్తున్నారు. గతంలో రమేష్, ఈశ్వర్ భార్యతో గొడవలు పెట్టుకోవడంతో ఈశ్వర్ సింగరేణి అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు రమేష్ ఉంటున్న క్వార్టర్స్‌ను ఖాళీ చేయించారు. ఇది దృష్టిలో ఉంచుకొని ఈశ్వర్ ఇంటికి వెళ్లిన నిందితుడు రమేష్ విచక్షణ రహితంగా ఈశ్వర్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు కొత్తగూడెం సింగరేణి ఆసుపత్రికి తరలించారు. బాధితుడు తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. బాధితుడికి మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు వైద్యులు ఖమ్మం తరలించారు. గతంలో వీరిరువురి మధ్య జరిగిన గొడవలను దృష్టిలో పెట్టుకొనే ఈ దాడికి పాల్పడినట్లు సీఐ తెలిపారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లు

కరకగూడెం, జూలై 6: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో పలు రోజులుగా మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు వెలుస్తున్నాయి. కరకగూడెం మండలంలోని పలు గ్రామాలలో వాల్ పోస్టర్లు వెలుస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ వాల్ పోస్టర్లు ఎవరు వేస్తున్నారు.. ఏం జరుగుతుందోనని మారుమూల ఏజెన్సీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై కరకగూడెం ఎస్‌ఐ రాజేందర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. మండల వ్యాప్తంగా వాల్ పోస్టర్లు వెలువడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. వాటిపై దృష్టి పెట్టామన్నారు. మావోయిస్టులు నిషేధిత మందుపాతరలతో అమాయక ప్రజల ప్రాణాలు బలికొనడం సరైనది కాదని, కాలం చెల్లిన సిద్ధాంతాలకు లోను కావద్దని తెలిపారు.


పలు గ్రామాల్లో వెలిసిన పోస్టర్లు

ప్రభుత్వ స్థలంలో గోదాం నిర్మాణం

» నిర్మాణ అనుమతులు లేకుండానే పనులు
» చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు


నిర్మాణంలో ఉన్న గోదాం

సత్తుపల్లి, జూలై 6: అత్యంత విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఒక వ్యక్తి దర్జాగా ఆక్రమించుకొని అక్రమంగా గోదాం నిర్మిస్తున్నాడు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని నిర్మాణం కొనసాగిస్తున్నా స్థానికులు ఫిర్యాదు చేసేవరకూ అధికారుల్లో చలనం లేకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

సత్తుపల్లి మండలం రేజర్ల రెవెన్యూ పరిధిలోని కొత్తూరు పంచాయతీలో 126/1 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ సర్వే నెంబర్‌లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఇందులో చాలా వరకూ ఆక్రమణలకు గురైంది. కొందరు 59 జీవో అనుసరించి రెగ్యులర్ చేయించుకున్నారు. ఇంకా మిగిలి ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని ఒక వ్యక్తి అక్రమంగా నిర్మాణం చేస్తున్నాడు.

రూ.లక్షల విలువైన స్థలం ఆక్రమణ

సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ నుంచి కొత్తూరు వెళ్లే దారిలో ప్రధాన రహదారి పక్కన సుమారు వెయ్యి గజాల స్థలాన్ని ఒక వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిలో గత కొద్ది రోజులుగా గోడౌన్ నిర్మాణం చేస్తున్నారు. ఆక్రమించుకున్న స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో కనిష్ఠంగా రూ.70లక్షలు ఉంటుందని గ్రామంలో కొందరు చెబుతున్నారు. ఏ రకమైన అనుమతులు లేకుండా అక్రమంగా ప్రభు త్వ భూమి ఆక్రమించుకోవడంతో పాటు దానిలో నిర్మాణ పనులు చేయడంపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

గత కొద్ది రోజులుగా అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నా స్థానిక పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. సాధారణంగా గ్రామ పంచాయతీలో భవనాల నిర్మాణానికి గాను అన్ని డాక్యుమెంట్లతో నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తును పరిశీలించి అధికారులు కనస్ట్రక్షన్ అనుమతులు ఇస్తారు. అనుమతులు వచ్చిన తరువాత పనులు ప్రారంభించాల్సి ఉంది. కాని ఇక్కడ ఏ రకమైన అనుమతులు లేకుండానే గత కొద్ది రోజులుగా అక్రమంగా పనులు సాగుతున్నాయి. అయినా అధికారులు మాత్రం పట్టించుకోలేదు. అక్రమ నిర్మాణం విషయంలో పంచాయతీ అధికారుల తీరుపై కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు.

పనులు అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకొని గోడౌన్ నిర్మాణం చేస్తున్నట్లు కొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించి సదరు స్థలాన్ని సర్వే చేయించారు. ప్రభుత్వ స్థలం అని నిర్ధారించారు. దీంతో జరుగుతున్న పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసి, పనులు ఆపించారు. ఈ విషయమై సత్తుపల్లి తహసీల్దార్ యోగీశ్వరరావును సంప్రదించగా కొత్తూరులో 126/1 సర్వేనెంబర్‌లో స్థలాన్ని ఆక్రమించుకొని కొందరు నిర్మాణ పనులు చేపట్టారని, అది ప్రభుత్వ స్థలం అని రుజువు కావడంతో పనులు నిలిపివేయడం జరిగిందన్నారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్రవాహనం

● తల్లీ, కుమారుడికి తీవ్రగాయాలు

కొణిజర్ల, జూలై6: ప్రమాదశాత్తూ ద్వి చక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో తల్లీకుమారుడికి గాయాలైన సంఘటన శనివారం మండలంలోని శాంతినగర్ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లాడ మండలం పాతమిట్టపల్లి గ్రామానికి చెందిన జల్ది నాగేశ్వరరావు అతని తల్లి రుక్మిణమ్మ ద్విచక్రవాహనం పై ఖమ్మం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా, శాంతినగర్ వద్ద రోడ్డు పక్కన ఉన్న చెట్టును ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఖమ్మం తరలించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్‌రావు తెలిపారు.

ఐదుగురు గంజాయి విక్రయదారుల అరెస్టు

● 7 కిలోల గంజాయిని సీజ్ చేసిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజిరెడ్డి

ఖమ్మం రూరల్, జూలై 6: ఒడిస్సా రాష్ట్రం నుంచి ద్విచక్ర వాహనాలపై హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్న ఐదుగురు విక్రయదారులను ఖమ్మం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను రూరల్ సీఐ రాజిరెడ్డి వెల్లడించారు. 1) ఖమ్మం పట్టణం, నెహ్రూ నగర్ ప్రాంతానికి చెందిన దొంతులు సాయి రాఘవేంద్ర, 2)హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన పోలోజు శరత్, 3) హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ఆలేటి శివ, 4)హైదరాబాద్ హయాత్‌నగర్‌కు చెందిన గొంగిడి నిశాంత్, 5)హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన కోట కృపాకర్‌లు ఈ ఐదుగురు కలిసి ద్విచక్రవాహనాలపై ఒడిస్సా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. మార్గమధ్యలోని ఖమ్మం రూరల్ మండలం, మద్దులపల్లి పరిధిలోని కోతులగుట్ట వద్ద ద్విచక్ర వాహనాలు నిలిపి గంజాయిని విక్రయించేందుకు పంచుకుంటున్నారు. కాగా సమాచారం మేరకు.. ఎస్‌ఐ కుసుకుమార్ తన సిబ్బందితో కోతులగుట్టవద్ద మాటు వేసి గంజాయి విక్రయదారులను అరెస్టు చేశారు. వారి నుంచి 7 కేజీల గంజాయిని, రెండు ద్విచక్రవాహనాలను, నాలుగు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 1.75 వేలు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్‌ఐ రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా లారీలు ఢీ

● వైరాలో త్రుటిలో తప్పిన ప్రమాదం

వైరా, జూలై 6: వైరాలోని శాంతినగర్‌కు సమీపంలో జాతీయ ప్రధాన రహదారిపై శనివారం జరిగిన ప్రమాదం త్రుటిలో తప్పిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరా నుంచి ఖమ్మం వైపు చేపల లోడ్‌తో వెళ్తున్న లారీని ఖమ్మం నుంచి వైజాగ్ పోర్టుకు లంగర్‌ను తీసుకువెళ్తున్న ట్రాలీ లారీ ఎదురుగా ఢీకొట్టింది. ఆసమయంలో ట్రాలీ లారీతో ఉన్న లంగర్ చేపల లోడ్‌ను చీల్చుకుంటూ వెళ్లింది. చేపల లోడ్ ధ్వంసమైంది. కొన్నిచేపలు రోడ్డుపైన పడిపోయాయి. అదే సమయంలో ట్రాలీ లారీపై ఉన్న లంగర్ రోడ్డు పక్కన నిలిపివేసిన ఒక మినీ వ్యాన్‌పై పడిపోవడంతో ఆ వాహనం ధ్వంసమైంది. ఆ వాహనంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిపోయింది. ఆస్తినష్టం తప్ప ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతిథి అధ్యాపకుల నియమాకానికి దరఖాస్తుల ఆహ్వానం

లక్ష్మీదేవిపల్లి, జూలై 6: కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 2024-2025 విద్యాసంవత్సరానికి లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఖాళీగా ఉన్నఅతిథి అధ్యాపకు పోస్టులను భర్తీచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హవీలా శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో రాజనీతి శాస్త్రంలో ఒక పోస్టు, తెలుగులో ఒక పోస్టు, కంప్యూటర్ సైన్స్‌లో ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పేజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని సూచించారు. పీహెచ్‌డీ నెట్ లేదా సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 8వ తేది సాయంత్రం నాలుగు గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని 9తేదీ ఉదయం 10గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్లు రెండు జిరాక్స్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ఐటీడీఏ పీవో రాహుల్
- టీచర్లు అందుబాటులో ఉండి స్టడీ అవర్స్ నిర్వహించాలి


హాస్టల్‌ను పరిశీలిస్తున్న పీవో రాహుల్

బూర్గంపాడు, జూలై 6: గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకాం తప్పని సరిగా రాత్రిపూట సబ్జెక్టు టీచర్లు విద్యార్థులకు అందుబాటులో ఉండి స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థులను మంచిగా చదివించి సందేహాలను నివృత్తి చేయాలని ఐటీడీఏ భద్రాచలం పీవో బి రాహుల్ అన్నారు. శుక్రవారం రాత్రి బూర్గంపాడు మండలంలోని ఏజీహెచ్ఎస్ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదులు, డార్మెటరీ, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు ప్రగతిని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బంకి సూచించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలను పెట్టాని తాజా కూరగాయలను వండాలన్నారు. రాత్రి పూట పిల్లలను బయటికిపంపకూడదని సూచించారు. పాఠశాల ప్రాంగనాలు పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. పాములు తేళ్లు వచ్చే అవకాశం ఉన్నందున పాఠశాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్తగా వచ్చిన టైం టేబుల్ ప్రకారం సమయానికి పాఠశాలలను నిర్వహించి సబ్జెక్ట్ టీచర్లు వంతుల వారిగా డ్యూటీలు వేసుకుని రాత్రి పూట విద్యార్థుల చేత పాఠాలు చదివించాలని అన్నారు. హెచ్ఎం, టీచర్లు అంతా అందుబాటులో ఉండాలని సూచించారు. ఏఎన్ఎం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల పై రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా హెచ్ఎం, వార్డెన్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయుడు భూక్యా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

జూలూరుపాడు, జూలై 7: మండలంలోని సూరారం గ్రామంలో బీఆర్ఎస్ నుంచి పలు కుటుంబాలు శనివారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి ఆయన పార్టీ కండువాలను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌కు రాజీనామ చేసి పటువురు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదనరావు, నాయకులు వేల్పుల నరసింహారావు, చింతా జగన్నాధం, హతిరాం, ధర్మా, భీముడు, కొర్రా నరసింహరావు, రామకృష్ణ, సురేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలి

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన
- సింగరేణికే కేటాయించాలని డిమాండ్


ఇల్లెందులో దీక్షలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

ఇల్లెందు టౌన్, జూలై 6 : సింగరేణిలో ఉన్న నాలుగు కోల్ బ్లాక్‌ల వేలాన్ని నిలిపివేసి సింగరేణికే కేటాయించాలని ఏఐటీయూసీ ఇల్లెందు బ్రాంచి కార్యదర్శి ఎండి. నజీర్ అహ్మద్, సీపీఐ పట్టణ కార్యదర్శి బందం నాగయ్యలు డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందు జీఎం కార్యాలయం ఎదుట సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వరంగ బొగ్గుగనుల సంస్థ సింగరేణి తెలంగాణలో ఏకైక పరిశ్రమగా ఉందని, 51శాతం రాష్ట్ర ప్రభుత్వానికి, 49శాతం కేంద్ర ప్రభుత్వానికి ఈక్విటీ వాటా ఉందని వివరించారు. కేంద్రం వేలం వేస్తున్న బొగ్గగనుల జాబితాలో సింగరేణి ఏరియాలో ఉన్న శ్రావణపల్లి బొగ్గుబ్లాక్‌ను చేర్చారని ప్రకటించారు. సింగరేణిలో ఈ గనిని సింగరేణికే కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ కొంగుబంగారం సింగరేణిలో బొగ్గు నిల్వలు అపారంగా ఉన్నాయని ప్రకటించారు. కోయగూడెం బ్లాక్ 3, సత్తుపల్లి బ్లాక్ 3లను సింగరేణికే కేటాయించాలని కోరారు. రానున్న రోజుల్లో నూతన గనులు రాకుండపోతే సింగరేణి భవిష్యత్ అంధకారం అవుతుందుని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, సీపీఐ జిల్లా నాయకులు దేవరకొండ శంకర్, సంజీవచారి, నూనె శ్రీనివాస్, జయరాజు, బొల్లి కొమరయ్య, కౌన్సిలర్ కుమ్మరి రవీందర్, గుగ్గిళ్ల శ్రీనివాస్, దాట్ల వెంకటేశ్వర్లు, జక్కుల శ్రీనివాస్, బొట్టు శ్రీను, ధర్మయ్య, వలీ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ రిలే నిరహార దీక్షలు

మణుగూరు: సింగరేణిలో బొగ్గు బ్లాక్‌ను వేలం ద్వారా ప్రవేటీ కరించే విధానాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ నాయకులు జీఎం కార్యాలయం ప్రాంగణ సమీపంలో శనివారం రిలే నిరసహార దీక్షలను చేపట్టింది. బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ దీక్షా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. జూలై ఆరవ తేది నుంచి 12 వరకు యూనియన్ ఇచ్చిన పిలువు మేరకు రిలేనిరహార దీక్షలను చేపడుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణికి చెందిన బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడాన్ని రద్దు చేయాలి ఎటువంటి ఆంక్షలు లేకుండా ఆ బ్లాక్‌ను సింగరేణికి అప్పగించానలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎంవి రామనర్సయ్య, మూఏకల ఈశ్వర్; జీ పుల్లారావు, ఆఫీసు బేరర్స్ ఆవుల నాగరాజు, నంబూరి శ్రీనివాసరావు, అబ్దుల్ సుభాన్, ఆడెపు రాజశేఖర్, అంధోని రవికుమార్, ఆర్ శివ, ఎండి ఇమాముద్దీన్, విజయ్, రమేష్, శ్రీనివాస్, ఏడుకొండలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆందోళన

ఇల్లెందు టౌన్: బొగ్గుగనులను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో శనివారం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. టీబీజీకేఎస్ ఇల్లెందు ఏరియా ఉపాధ్యక్షుడు ఎస్‌కే. హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు దిండగల రాజేందర్ మాట్లాడారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రైవేటీకరిస్తున్నాయని ఆరోపించారు. గనుల వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరంవినతిపత్రాన్ని ఏరియా జీఎం జాన్‌ఆనంద్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు సిలివేరు సత్యనారాయణ, లలిత శారద, అబ్దుల్ నబీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారిగా శ్రీను

అశ్వారావుపేట రూరల్, జూలై 6: ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారిగా అశ్వారావుపేట మండలానికి చెందిన శీమకుర్తి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు దారా రమేశ్ నియామకపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు విజచబాస్కర్, జిల్లా నాయకులు నగేశ్, చంద్రశేఖర్, అశ్వారావుపేట మండల అధ్యక్షులు శీమకుర్తి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు లోక్‌నాథ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ఆర్యవైశ్య మహాసభ కోశాధికారిగా నియమితులైన శ్రీనివాసరావును పలువురు ప్రముఖులు, రాజకీయ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

కొత్త చట్టాలతో సామాన్య ప్రజలకు న్యాయం దూరం

- మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవిప్రసన్న

చుంచుపల్లి, జూలై 6: కొత్త చట్టాలతో సామాన్య ప్రజలకు న్యాయం దూరమైందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న మండిపడ్డారు. శనివారం మండలంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కొత్త చట్టాలపై పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ జరపకుండా ఆగమేఘాలపై చట్టాలను ఏర్పాటు చేసి అమలు చేయడం సరికాదన్నారు. గతంలో ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసే వారని, కొత్త చట్టాలు అమలులో ఉన్న నేపథ్యంలో ఫిర్యాదు చేసిన 15 రోజుల వరకు కేసులు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. అదేవిధంగా మహిళలకు ఈ చట్టాల వలన తీవ్ర అన్యాయం ఎదురయ్యే ప్రమాదం ఉందని విమర్శించారు. రాబోయే రోజుల్లో నూతన చట్టాలను కాంగ్రెస్ ఎదురొడ్డి పోరాడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ నాయకురాళ్ళు కమల, జ్యోతి, దివ్య, సరిత, బండ్ల రజిని, గౌరి, నాగమణి, సున్నం లక్ష్మీ, సౌజన్య, కృష్ణవేణి, ప్రియాంక, పద్మ, వెంకటరత్నమ్మ, వరలక్ష్మీ, రజియా, శ్రీదేవి, విజయలక్ష్మీ, దర్వంతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ నూతనకమిటీ ఎన్నిక

ఇల్లెందు టౌన్, జూలై 6: సింగరేణి కాలరీస్ మజ్దూర్ సంఘ్ బీఎంఎస్ ఇల్లెందు డివిజన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఏరియా ఉపాధ్యక్షుడుగా నాయిని సైదులు, ఏరియా కార్యదర్శిగా లీలా కృష్ణ, జాయింట్ సెక్రటరీగా వై. నాగేశ్వరరావు, పి. కిషోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి. రాజశేఖర్, టి. ప్రభాకర్, ఆఫీస్ సెక్రటరీగా సుమంత్, ట్రెజరర్‌గా శశికుమార్‌లను ఎన్నుకున్నారు. అదేవిధంగా కేటీసీ, జీకే 5ఓసీ, సీహెచ్‌పీల ఫిట్‌కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు కార్మికులు బీఎంఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ సెంట్రల్ నాయకులు మండా రమాకాంత్, జేబీసీసీఐ సభ్యులు మాధవ్‌నాయక్, జనరల్‌సెక్రటరీ పవన్‌కుమార్, కార్పోరేట్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, సెంట్రల్‌కార్యదర్శి ఆరుట్ల మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు కలిసికట్టుగా పనిచేయండి: ఎంపీపీ

చంద్రుగొండ, జూన్ 6: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్నిశాఖల అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేయాలని ఎంపీపీ పార్వతి కోరారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ వ్యాధుల నివారణకు పంచాయతీల కార్యదర్శులతో పాటు ఐసీడీఎస్, ఐకేపీ తదితర శాఖల సిబ్బందితో వైద్యశాఖ అధికారులు సమన్వయంచేసుకుంటూ గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సీసీ రోడ్లు ప్రారంభం

మణుగూరు, జూలై 6: మణుగూరు మండలంలోని సమితి సింగారంలో గల ప్రభుత్వ జూనియర్ కాలేజి, డిగ్రీ కాలేజిల సముదాయంలో ఉన్న అంతర్గత సీసీ రోడ్లను పినపాక ఎమ్మెల్యే పాయం శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులు కళాశాలకు వచ్చేందుకు మట్టి రోడ్లు ఉన్న స్థానంలో రూ.24 లక్షలతో సీసీ రోడ్లు ను ఏర్పాటు చేశారు. అనంతరం కళాశాల పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాయం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, వైఎస్ ఎంపీపీ కేవీ రావు, జూనియర్ కాలేజి, డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, పీఆర్ఏఈ రామారావు, ఇవోఆర్‌డి పల్నాటి వెంకటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఏడూళ్లబయ్యారం ఎస్ఐగా రాజ్‌కుమార్

పినపాక, జులై 6: మణుగూరు సబ్ డివిజనల్ పరిధిలోని ఏడూళ్లబయ్యారం సర్కిల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఇమ్మడి రాజ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌హెచ్‌ఓగా పని చేసిన వెంకటప్పయ్య సాధారణ బదిలీల్లో భాగంగా దుమ్ముగూడెం బదిలీ అయ్యారు. ఎస్ఐ రాజ్‌కుమార్ మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఉండాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారి పట్ల, సంఘ విద్రోహ శక్తులు, వారికి సహకరించే వారి పట్ల కఠినంగానే ఉంటామని, సామాన్య ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ అమలు చేస్తామన్నారు.

బూర్గంపాడు ఎస్ఐగా రాజేష్

బూర్గంపాడు, జూలై 6: బూర్గంపాడు ఎస్ఐగా రాజేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్ఐగా పని చేసిన సుమన్ సీసీఎస్‌కు బదిలీ కాగా కొత్తగూడెం-2 టౌన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ బదిలీపై బూర్గంపాడు వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

అడవులతోనే మానవ మనుగడ: పినపాక ఎమ్మెల్యే పాయం


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు, జూలై 6: అడవులతో మానవ ముడిపడి ఉందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం బూర్గంపాడు మండల పరిదిలోని కృష్ణసాగర్ గ్రామంలో తెలంగాణ రెసిడెన్షియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన పూర్తి బాధ్యత ఉందన్నారు. నానాటికి అడవులు అంతరించిపోతుండడంతో వాతవరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. అనంతరం వేపలగడ్డ గ్రామంలో జీవజల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూ హోప్ ట్రైబల్ చిల్డ్రన్స్ హోమ్ అనాధ ఆశ్రమంను పాయం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో సునీల్, నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సతీష్, ప్రసాద్, వీరారెడ్డి, లక్ష్మీనారయణరెడ్డి, సాంబ, రమేష్, రహీంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

బూర్గంపాడు మండల పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అదికారులతో మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో బ్లీచింగ్, పాగింగ్, డ్రైనేజీ పూడిక తీతలు చేపట్టాలన్నారు.

ఉద్యోగం సాధించి ఆదర్శంగా నిలవాలి: సీఐ

చర్ల, జులై 6: పోటీ పరీక్షలకు నగదు లేక ఇబ్బంది పడుతున్న నిరు పేదల ఆదివాసీ గిరిజన యువకుడికి చర్ల సీఐ రాజువర్మ తన వంతు సాయం అందిచారు. పుస్తకాల కొనుగోళ్ళకు శనివారం పది వేల సహాయం చేశారు. చర్ల మండలం కొక్కట్ పాడు గ్రామం పూర్తిగా మావోయిస్టు ప్రభావిత ప్రాతం, అక్కడి విద్యార్థులు ఉన్నత చదువులు చదవడం కూడా కష్టమే అలాంటిది రవ్వా జోగ్నేష్ అనే యువకుడు పడి యువకుడు ఇంజనీరింగి పూర్తి చేశాడు. ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. పుస్తకాలకు నగదు లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం తెల్సుకున్న చర్ల సీఐ రాజువర్మ విద్యార్థితో మాట్లాడారు. కాంపిటీషన్ మెటీరియల్ కొనుగోలు కోసం 10 వేల సాయం అందించారు. పోటీ పరీక్షల్లో రాణించాలని, ఉద్యోగం సాదించి, గ్రామానికి ఆదర్శంగా నిలవాలని యుకుడికి సీఐ సూచించారు. కాగా సీఐ సాయం మరువ లేనిదని యువకుడు తెలిపాడు. సీఐ చేసిన చిరు సాయాన్ని చర్ల ఎస్ఐ నర్సిరెడ్డి, ఇతర సిబ్బంది కొనియాడారు.

గుత్తికోయ గ్రామంలో కమ్యూనిటీ కనెక్ట్ పోగ్రాం

లక్ష్మీదేవిపల్లి, జూలై 6 : కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీదేవిపల్లి పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది మండలంలోని గుత్తికోయ గ్రామమైన గంద్రబందం, బాసగుంపు గ్రామాల్లో కమ్యూనిటి కనెక్ట్ పోగ్రామ్‌ను నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలోకి ఎవరైన కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్థులకు సూచించారు. దోమల బారిన పడకుండ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం అక్కడ సమావేశంలో పాల్గొన్న ప్రతి కుటుంబానికి రెయిన్ కోట్లు, దుప్పట్లు, దోమ తెరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు: సీఐ

దుమ్ముగూడెం జూలై 6: ఆదివాసి ప్రాంత అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టులకు సహకరించొద్దని సీఐ బొడ్డు అశోక్ కోరారు. కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగంగా మావోయిస్టు ప్రభావిత ముల్కనాపల్లి గొత్తికోయ గ్రామంలో శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. తొలుత అనుమానిత వ్యక్తుల కోసం గ్రామంలోని ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామంలోకి కొత్తవారు ఎవరైనా వస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐ గణేష్, ఆర్ఎస్ఐ హుస్సేన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో భాగంగా గోదావరి వరద ప్రభావిత సున్నంబట్టి గ్రామస్థులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ యంత్రాంగంతో సహకరించి వరద ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.

జీవో నెం 10ని రద్దు చేయాలి: సీఐటీయూ

కొత్తగూడెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ హెల్పర్లకు ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పినందున పోరాట బాట పట్టాల్సి వచ్చిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కే. బ్రహ్మాచారి పేర్కొన్నారు. గతంలో అంగీకరించిన విధంగా అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2లక్షలు, హెల్పర్‌కి లక్షరూపాయలు రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారని, జీవో నెం: 10ని రద్దు చేయాలని న్యాయబద్ధమైన రిటర్మెంట్ బెన్‌ఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి. పద్మ, జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే. సత్య జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, నాయకురాళ్లు రమ్య, కృష్ణ, తిరుమల రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నపాలెం రోడ్డును బాగుచేయండి

చంద్రుగొండ, జూన్ 6: గ్రామంలో రోడ్డుపై గుంతలు ఏర్పడి రోడ్డు బురదమయంగా మారటంతో శనివారం రోడ్డుపై నిరసనకు దిగారు మండల పరిధిలోని అయ్యన్నపాలెం వాసులు. మండల కేంద్రమైన చంద్రుగొండ నుంచి అయ్యన్నపాలెం గ్రామంలోకి ప్రవేశించే ప్రాంతంలో బీటీ రోడ్డుకు పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. దీంతో గ్రామస్తులు రోడ్డుపై కొంతసేపు నిరసన తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో గెలిస్తే రోడ్డు, డ్రెయిన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పడు సమస్య పరిష్కరించమంటే చూద్దాం, చేద్దాం అట్టున్నారని ఆవేదన వ్యక్తం చేవారు. అధికారులైన తమగోడు పట్టించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి, జులై 6: అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం వైభవంగా వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. చుట్టు ప్రకల గ్రామాలకు చెందిన భక్తులు భక్తిశ్రద్దలతో స్వామివారి కళ్యాణం తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సిలింగ్

భద్రాచలం, జూలై 6: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకులాల్లో జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థిని విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 10న భద్రాచలంలోని గిరిజన గురుకుల కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

బాల కార్మికులతో పనిచేయిసున్న ఇరువురిపై కేసు నమోదు

సుజాతనగర్, జూలై 6: బాల కార్మికులతో పని చేయిస్తున్న ఇరువురిపై శనివారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా కొత్తగూడెం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎండీ ఫర్భీద్దీన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ మెకానిక్ షాపులో పని చేస్తున్న 16 ఏళ్ల బాలుడు, ఓ వస్త్ర దుకాణంలో 17 ఏళ్ల యువతి పనిచేయడంతో వారి ఇరువురి షాపు యజమానులపై కేసు నమోదయినట్లు అధికారులు తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేడు జగన్నాథ రధయాత్ర

అశ్వాపురం జూలై 6: అశ్వాపురం గౌతమి నగర్ కాలనీలో ఆదివారం సాయంత్రం జగన్నాథ రధయాత్ర వైభవంగా జరగనుంది. ఇందుకోసం సంస్థ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఉద్యోగులు పథాగర్ సంస్థ గా ఏర్పడి ప్రతిఏటా ఇక్కడ పూరి జగన్నాథ రథయాత్రకు అనుబంధంగా రథయాత్రను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో రధయాత్రలకు సంబంధించి ఉత్కల్ పతాగర్‌లో ప్రత్యేక రధాన్ని రంగులతో అలంకరించి రధయాత్రలకు సిద్దం చేశారు. ఉత్కల్ మండపాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ యాత్రను భారజల కర్మాగార జీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించనున్నారు. తొమ్మిది రోజుల పాటు యాత్ర కొనసాగి బహుదయాత్రతో ముగియనుంది.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

పాల్వంచ టౌన్, జూలై 6: దేశంలో సమసమాజ స్థాపనకు అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు కొనియాడారు. మాజీ ఉపప్రధాని, స్వతంత్ర సమర యోధుడు, బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం జగ్జీవన్‌రామ్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. బీసీఎం రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కొత్వాలతోపాటు నిర్వాహకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో జగ్జీవన్ రామ్ ఉత్సవకమిటి నిర్వాహకులు దండోరా శ్రీను, కాల్వ భాస్కరరావు, కొత్తపల్లి సోమయ్య, కాల్వ ప్రకాష్ రావు, గొడ్ల మోహన్, జడ్పీటీసీ సభ్యులు బరపటి వాసుదేవరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడవల్లి కృష్ణ, మండల అధ్యక్షులు కొండం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: దళితుల, బహుజనుల అభ్యున్నతకై కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని పలువురు నాయకులు కొనియాడారు. శనివారం జూలూరుపాడులో దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ, ఎమ్మార్పీఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదనరావు, నాయకులు మోదుగ రామకృష్ణ, వేల్పుల నరసింహారావు, పోతురాజు నరసింహరావు, కిరణ్, ఎమ్మార్పీఎస్ నాయకులు చంగల గురునాధం, దిబ్బెందుల సాయి, చాపలమడుగు నరసింహరావు, కాకటి కృష్ణ, నరేందర్ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: లక్ష్మీనగరంలో శనివారం ఎంఆర్‌పీఎస్ నాయకులు బాబూ జగజ్జీవన్‌రాం వర్ధంతిని నిర్వహించారు. అలవాల రాజా, కొప్పుల తిరుపతి, మేకల లత, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, లక్ష్మణ్, కుమారి, నాగమణిలు పాల్గొన్నారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అశ్వారావుపేట రూరల్, జూలై 6: అశ్వారావుపేటలో శనివారం జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ నేతృత్వంలో పార్టీ నాయకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు చైతన్య, శ్రీను, కళ్యాణ్, శ్యాంకుమార్, వినోద్, అక్షయ్ పాల్గొన్నారు.

దమ్మపేట: దమ్మపేటలో జరిగిన శ్యాంప్రసాద్ ముఖర్జి జయంతి వేడుకల్లో బీజేపీ నాయకులు స్టేట్ కౌన్సిల్ మెంబర్ కొలికిపోగు మునలయ్య, కన్వీనర్ గొట్టిపోళ్ళ శ్రీనివాస్, ఉడత నేని విశ్వేశ్వరరావు, ప్రశాంత్, నాగరాజు పాల్గొన్నారు.

చుంచుపల్లి: చుంచుపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, నాయకులు నరసింహ, నరేంద్రబాబు, జగన్‌మోహన్, మురళీ, రామారావు పాల్గొన్నారు.

భద్రాచలం: భద్రాచలంలో జరిగిన శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకల్లో బీజేపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి రామ్మోహన్‌రావు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుంజా ధర్మారావు, నిడదవోలు నాగబాబు, ఆవుల సుబ్బారావు, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ములిశెట్టి నిఖిల్, పీసీ కేశవ్ పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

కొత్తగూడెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను నిర్వహిస్తున్న నెఫ్రోప్లస్ సంస్థ నిర్వహణ లోపం, నిర్లక్ష్యం కారణంగా డయాలసిస్‌కు వచ్చిన ఇల్లెందు ఏరియాకు చెందిన యాకూబ్ ఖాన్ ఈపీ ఆపరేటర్ నెఫ్రోప్లస్ డయాలసిస్ సెంటరులో హార్ట్‌ఎటాక్‌తో సరైన పర్యవేక్షణ లేక శుక్రవారం మృతి చెందడం జరిగింది. ఈ సెంటరులో డాక్టర్ అందుబాటులో లేక కనీసం స్ట్రెక్చర్ కానీ వీల్‌చైర్ అక్కడ అందుబాటులో లేని కారణంగా ఖాన్‌ని క్యాజివాలిటికి తరలించే సదుపాయం లేనేందున ఆయన డయాలసిస్ సెంటరులోనే మరణించారు. శనివారం ఏఐటీయూసీ నాయకత్వంలో సింగరేణి ప్రధాన ఆసుపత్రి అడిషనల్ సీఎంవో డాక్టర్ విక్టర్ వందనంతో మాట్లాడారు. కొంతకాలంగా నెఫ్రోప్లస్ వారు రోగుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్నట్లుగా వారి దృష్టికి వచ్చిందని దీనిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఖాన్ మరణానికి నెఫ్రోప్లస్ ఆరే బాధ్యత వహించి మృతుని కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని ఈ సెంటరు నిర్వాహకులను పిలిచి మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఏసీఎంవో పై ఫిర్యాదు చేస్తామని వారి మేనేజరును పిలిచి మాట్లాడదామన్నారు. ఏసీఎంవోని కలిసిన వారిలో నాయకులు వంగ వెంకట్, వీరస్వామి, ఎస్. నాగేశ్వరరావు, ఎస్. శ్రీనివాస్, శ్యాంసన్, లక్ష్మీనారాయణ, మధు కృష్ణ ఉన్నారు.

సీతారామ ద్వారా ఏజెన్సీ ప్రాంతానికి సాగునీరు అందించాలి

- న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు



మాట్లాడుతున్న ఎన్డీ నాయకుడు మధు

ఇల్లెందు టౌన్, జూలై 6: సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మ, వరంగల్, జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు సాగునీరు అందించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు, గౌని అయిలయ్య డిమాండ్ చేశారు. శనివారం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఎకరానికి సాగునీరు అందించే ప్రాజెక్టుగా సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ఉంటుందని గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. రోళ్లపాడు చెరువును రిజర్వాయర్‌గా మార్చి దాని నుంచి బయ్యారం చెరువుతోపాటు డోర్నకల్, పాలేరు నియోజకవర్గాలకు కూడా నీరు అందిస్తామని ప్రాజెక్టు డీపీఆర్‌లో ప్రకటించారని వివరించారు. సీతారామ ప్రాజెక్టులో కీలక రిజర్వాయర్‌గా మారే రోళ్లపాడు చెరువులో 2016 ఫిబ్రవరి 16న నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. 2018 కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన ఇల్లెందు ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లెందు నియోజకవర్గంలో మొత్తానికి నీరు ఇస్తామని ముఖ్యమంత్రి హామి ఇచ్చారిన అందుకోసమే పార్టీలే చేరానని ప్రకటించి విస్మరించారని తీవ్రంగా విమర్శించారు. తమ పార్టీ ఆందోళనలు చేస్తే పోలీసుల ద్వారా అడ్డుకుని నిర్బంధించారని ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టు నీరు ఏజెన్సీ ప్రాంతానికి అందించేందుకు న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలకు పూనుకుంటామని ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు మోకాళ్ల మురళీ కృష్ణ, తుపాకుల నాగేశ్వరరావు, గౌని నాగేశ్వరరావు, గొడుగు నర్సింహారావు, కొప్పు సారంగపాణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి


వినతి పత్రాన్ని అందిస్తున్న సీపీఐ నాయకులు

మణుగూరు, జూలై 6: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలనువెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు దుర్గాల సుధాకర్, తదితరులు మణుగూరు మునిసిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావుకు శనివారం వినతిపత్రాన్ని అందించారు. నాయకులు మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలో ప్రజలు వీధిలైట్లు, సైడ్ డ్రైన్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వి నాయుడు, ఎస్‌కె సర్వర్, కొత్తపల్లి సీతారాములు,ఎ రాములు, కె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.